
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 5 నవంబరు 2024


నరసరావుపేట: శ్రీ త్రికోటేశ్వరస్వామికి విశేష అలంకారం


అమరావతి: నదీతీరంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు


అమరావతి: తెల్లవారుజామున కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు

ఆలయాల్లో కార్తీక శోభ

కార్తీకమాస తొలి సోమవారం సందర్భంగా శివాలయాలలో శివ నామ స్మరణలు మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆయా ప్రాంతాల్లోని ఆలయాల వద్దకు వెళ్లి, పుణ్యస్నానాలు ఆచరించి కార్తీకమాస దీపాలు వెలిగించి, స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని సందర్శించుకొని మొక్కులు చెల్లించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో కార్తీకమాస శోభ సంతరించుకుంది. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు పలువురు ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, అధికారులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు ఏ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

గుంతల రోడ్లకు మోక్షం!





- మరమ్మతులకు భారీగా నిధులు
- మూడు జిల్లాల్లో ముమ్మరంగా పనులకు శ్రీకారం
- ఇప్పటికే ఆర్‌అండ్‌బీ శాఖకు చేరిన నిధులు

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనా నిర్వాకంతో గుంతలూరుగా పేరుమోసిన ఉమ్మడి గుంటూరుజిల్లా రహదారులకు ఎట్టకేలకు శాప విమోచన కలుగుతోంది. రాష్ట్రంలోని రోడ్లపై గుంతలు కనిపించకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ' కార్యక్రమంతో రోడ్ల మరమ్మతులకు మోక్షం కలిగింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన రాష్ట్ర రహదారులు చాలా చోట్ల గుర్తించడానికి కూడా వీలు లేనంతగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్లను బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం తొలి అడుగుగా మరమ్మతుల కార్యక్రమాన్ని చేపట్టింది. అందుకోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు భారీ మొత్తంలో నిధులు కేటాయించింది.

ఘోరంగా దెబ్బతిన్న రోడ్లు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతినిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకే గుంటూరు, పల్నాడు డివిజన్ల పరిధిలో 400 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నాయి. గడిచిన ఐదేళ్లలో కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో దెబ్బతినని రోడ్డు కూడా లేదు. రోడ్ల అభివృద్ధి మాట ఎలా వున్నా మరమ్మతులకు, ప్యాచ్ వర్కుల కోసం ఈఈలకు కేటాయించే నామమాత్రపు నిధులు కూడా వైసీపీ ప్రభుత్వం కేటాయించలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తలో కిలో మీటరుకు రూ. 25వేలుగా వున్న మరమ్మతుల ఖర్చులను రూ. 40 వేలకు పెంచి నానా హడావుడి చేసింది. కానీ ఆచరణలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో కనీసం గుంతలో మట్టి పోసేందుకు కూడా కాంట్రాక్టర్లు రాకుండా ముఖం చాటేశారు. దీంతో ఆ రోడ్లపై అడుగుతీసి అడుగు వేయాలంటేనే నరక ప్రాయంగా, ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. ఈ రోడ్లను ఇప్పటికి ఇప్పుడు బాగు చేయడం, కొత్త రోడ్డు వేయడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రంపై అది భరించలేని భారమే కాకుండా, చాలా సమయం పట్టే అవకాశం

(మిగతా 6వ పేజీలో..)


నాగార్జున సాగర్ జలాశయం

నిండుకుండలా..

- పూర్తి నీటి నిల్వతో జలాశయాలు కళకళ
- నాగార్జున సాగర్‌లో 306 టీఎంసీలు
- పులిచింతలలో 45.1 టీఎంసీలు
- ఇంకా కొనసాగుతున్న నీటి ప్రవాహం
- 11 లక్షల ఎకరాలకు సాగు నీరు
- వచ్చే ఏడాది కూడా నీటికి ఢోకా ఉండదని అంచనా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగర్ ఆయకట్టులో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. పంటల సాగుకు పుష్కలంగా నీటిని అందిస్తోంది. అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. నాగార్జున సాగర్ జలాశయానికి కృష్ణమ్మ పోటెత్తింది. రికార్డు స్థాయిలో 5.60 లక్షల కూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. జూలై మాసం చివరిలో జలాశయానికి ప్రారంభమైన వరద ప్రవాహం నేటికి కొనసాగుతూనే ఉంది. గతంలో నీటి నిల్వలు పరిశీలిస్తే నవంబరు నెలలో రికార్డు స్థాయిలో సాగర్‌లో నీటి నిల్వ ఉండటం విశేషం. నాగార్జున సాగర్.. దిగువన ఉన్న పులిచింతల జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. సాగర్ కుడి కాలువ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని కుడి కాల్వ ఆయకట్టులోని 11.11 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. వచ్చే ఏడాదికి కూడా సాగు నీరుకు ఢోకా ఉండదని అంచనా వేస్తున్నారు. వరద ప్రవాహం ఇంకొన్ని రోజులు కొనసాగవచ్చని జలవనరుల శాఖ అధికారులు అంచనా.

నాగార్జునసాగర్ జలాశయంలో 98 శాతం మేర నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు. సోమవారం డ్యాంలో నీటి నిల్వ 305.86 టీఎంసీలు ఉంది. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ 590 అడుగులకు గాను 587.60 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయానికి 37,659 కూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు, విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్న నీటితో కలసి మొత్తం 47,261 క్యూసెక్కుల నీటిని డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు.

నాగార్జున సాగర్ దిగువన ఉన్న కేఎల్‌రావు పులిచింతల జలాశయం కూడా పూర్తిస్థాయి నీటి నిల్వతో తొణికిసలాడుతోంది. ఈ జలాశయం కూడా ఆగస్టు రెండో వారంలో నిండింది. అప్పటి నుంచి నేటి వరకు పూర్తి స్థాయి నీటి నిల్వ కొనసాగుతోంది. పులిచింతల పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా 45.1 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 174.57 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయంలోకి నీటి ప్రవాహం 29,846 క్యూసెక్కులు. ఇక్కడ నుంచి 26,945 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


పులిచింతల జలాశయం

మీరే రండి

- సీఈవో ఆదేశాలు బేఖాతరు
- సచివాలయాల్లోనే కూర్చుంటున్న బీఎల్‌వోలు
- పట్టభద్రుల ఓటరు దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి రావాలని ఆదేశం
- అటెస్టు చేసిన కాపీలు, ఒరిజినల్ డిగ్రీ తీసుకురావాలని సమాచారం
- ఇంటింటికి వెళ్లి పరిశీలించేందుకు బద్ధకిస్తున్న సెక్రటరీలు

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఆదేశాలు అంటే జిల్లాలో లెక్క లేకుండా పోయింది. పట్టభద్రుల ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొన్న ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లి డాక్యుమెంట్లను పరిశీలించాలని ఆయన విస్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల బీఎల్‌వోలు వాటిని ఉల్లంఘిస్తున్నారు. దరఖాస్తుదారుల/ కుటుంబంలో ఎవరో ఒకరికి ఫోన్ చేసి మీ ఇంట్లో ఫలాన వ్యక్తి గ్రాడ్యుయేట్స్ ఎన్నికల ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొన్నారు. ఒరిజినల్ డిగ్రీ, అటెస్టు చేసిన కాపీ, ఆధార్, ఓటరు ఐడీ జిరాక్స్ కాపీలను తీసుకొని సచివాలయానికి రావాల్సిందిగా ఆదేశిస్తున్నారు. ఎవరైనా గట్టిగా మాట్లాడితే తామే వస్తామని చెబుతున్నారే కానీ గంటల తరబడి నిరీక్షించినా బీఎల్‌వోలు రావడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో భాగంగా నియమితులైన గ్రామ/వార్డు సెక్రెటరీలలో కొందరు ఇంకా ఆ ప్రభుత్వంలోనే ఉన్నామన్న రీతిలో ప్రవర్తిస్తున్నారు. పనితీరుని ఏమాత్రం మార్చుకోవడం లేదు. సచివాలయాలకు రావడం, ఫీల్డ్‌కు వెళ్లకుండా అక్కడే కూర్చుని అన్నింటిని ఫోన్‌లో చక్కబెట్టుకోవాలని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అయితే వారికి ఎలాంటి పని లేకపోవడంతో చివరికి ఎన్నికల విధులను సక్రమంగా

(మిగతా 6వ పేజీలో..)

నేడు సరస్వతీ భూములను పరిశీలించనున్న పవన్‌కల్యాణ్

పోషకాలు తెలుసుకునేందుకే ఆల్ఫా స్పెక్ట్రల్ ల్యాబ్

- వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

6

రేపు బాపట్ల, పల్నాడు కాంగ్రెస్ నేతలతో ఏపీసీసీ చీఫ్ షర్మిల సమావేశం

యూట్యూబ్.. సైన్స్ మాస్టారు

- లిటిల్ సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ పేరుతో ఛానల్
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విశేష ఆదరణ
- తెనాలికి గర్వకారణం రాయపాటి శివనాగేశ్వరరావు

8

మానవతా వాది ఆలూరి బైరాగి

- నేడు ఆలూరి జయంతి

అక్రమాలకు అడ్డేది..


పట్టణంలో మునిసిపల్ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలు

- సత్తెనపల్లిలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- మాజీ కౌన్సిలర్ అండతో విచ్చలవిడిగా
- కూటమి ప్రభుత్వంలోనైనా అక్రమాలకు అడ్డు పడేనా?

సత్తెనపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వదిలి వేయడంతో అనధికార కట్టడాలు తామరతంపరగా పెరిగిపోయాయి. టౌన్ ప్లానింగ్‌లో గత నాలుగు సంవత్సరాల కాలంలో పని చేసిన అధికారులు, సిబ్బంది కొందరు మామూళ్ల మత్తులో అప్పటి వైసీపీ నాయకుల సహకారంతో అక్రమ నిర్మాణదారులకు సహకరించారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ ఒకరు పట్టణంలో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మించటంలో కీలక పాత్ర పోషించారనే విమర్శలు ఉన్నాయి. నిర్మాణ దారుల వద్ద భవనాలను బట్టి వేల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసుకున్నాడు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు అతని మాట కాదనకుండా అక్రమ కట్టడాలను, అనుమతులు లేని నిర్మాణాలను ప్రోత్సహించారు. ప్లాన్ లేకుండానే సత్తెనపల్లి పట్టణంలో నాలుగు సంవత్సరాల కాలంలో 40 వరకు భవనాల నిర్మాణాలు జరిగాయంటే ప్రభుత్వ ఆదాయానికి ఏ విధంగా గండి పడుతుందో చెప్పవచ్చు. అనుమతులకు విరుద్ధంగా మరో 150 వరకు భవనాల నిర్మాణాలు పట్టణంలో జరిగాయి. ఈ అక్రమ నిర్మాణాలకు మాజీ కౌన్సిలర్ వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు వసూలు చేసి సొమ్ము చేసుకున్నాడు. ఇంటికి అనుమతి తీసుకొని షాపు రూమ్‌లు కట్టే వారి వద్ద అధిక మొత్తంలో వసూలు చేశాడు. అతను సాగించిన అక్రమ వసూళ్ల వల్లే పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు అనుమతులు లేకుండా జరిగాయి. అక్రమ నిర్మాణాలపై వైసీపీ ప్రభుత్వ హయాంలో కౌన్సిల్‌లో చర్చ కూడా జరిగింది. అక్రమ కట్టడాలపై పత్రికల్లో కథనాలు వచ్చిన సమయంలో భవన నిర్మాణ దారులకు టౌన్ ప్లానింగ్ అధికారులు కంటి తుడుపు చర్యగా నోటీసులు ఇచ్చి మమ అనిపించారు. మాజీ కౌన్సిలర్ అవినీతి గురించి రాజకీయ పక్షాలు బహిరంగంగానే విమర్శించినా ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటికీ కూడా పట్టణంలో ప్లాన్ అప్రూవల్స్ లేకుండానే నిర్మాణాలు జరుగు తున్నాయి. సెల్లార్లు లేకుండా బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తున్నారు. వాటిపై ఇప్పటివరకు ఎటువంటి చర్యలు లేవు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భవన నిర్మాణాలపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే పట్టణ ప్రణాళికా విభాగంలో జరిగిన అవకతవకలు వెలుగులోకి వస్తాయి.

అక్రమ కట్టడాలను గుర్తించాం : కమిషనర్

అక్రమ కట్టడాలపై మునిసిపల్ కమిషనర్ షమ్మి మాట్లాడుతూ పట్టణంలో 34 భవనాలకు ఎటువంటి అనుమతులు లేకుండానే నాలుగు సంవత్సరాల కాలంలో నిర్మాణాలు జరిగాయన్నారు. 133 భవనాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయన్నారు. వీరందరికీ నోటీసులు జారీ చేశామని, అవసరమైతే కోర్టుకు కూడా వెళ్తామన్నారు.


పట్టణంలో మునిసిపల్ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలు

కాపాడుకోకుంటే కనుమరుగే

- నాటి చరిత్రకు సజీవసాక్ష్యాలు
- యుద్ధవీరుల స్మృతులు నేటికీ పదిలం
- పర్యాటకంగా అభివృద్ధి కోసం ఎదురుచూపు
- 31 నుండి వీరారాధన ఉత్సవాలు

కారంపూడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పల్నాటి యుద్ధం.. దాయాదుల పోరులో కత్తులు నర్తించడంతో ఎందరో వీరులు అమరులయ్యారు.. తెలుగు రాష్ట్రాల్లో ఈ యుద్ధం గురించి తెలియని వారుండరు.. వారిని స్మరించుకుంటూ ప్రతి ఏటా కార్తీక అమావాస్య నుంచి వీరులకు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.. ఆనాటి యుద్ధ వీరుల స్మృతులు నేటికీ పదిలంగానే ఉన్నాయి. అప్పటి కట్టడాలు, గుర్తులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఆ చరిత్రను భావితరాలకు అందించాలంటే నాటి చరిత్రకు సజీవసాక్ష్యాలను కాపాడుకోవాల్సిందే.

సజీవంగా చిహ్నాలు..

1184లో కారంపూడిలో జరిగిన 12 శతాబ్ధపు నాటి పల్నాటి యుద్ధ చిహ్నాలు నేటికీ సజీవంగా ఉన్నాయి. కన్నమదాసు మేడ, బ్రహ్మనాయుడు నామాల మండపం, నాడు పాలించిన రాజుల కోట బురుజు, అంకాళమ్మ, చెన్నకేశవస్వామి దేవాలయం, యుద్ధభూమి, రాక్షసబండ, బ్రహ్మనాయుడు కొండను నరికిన ప్రదేశం, బాలచంద్రుడు పులిజూదం ఆడిన బండ, బురుజు మీద నుంచి పొట్టేలు దూకగా బండపై పడిన కాళ్ల గుర్తులు ఇలా అన్ని చిహ్నాలు కారంపూడి పరిసర ప్రాంతాల్లో పల్నాటి చరిత్రకు చిహ్నాలుగా పదిలంగా ఉన్నాయి.

అభివృద్ధి కోసం ఎదురుచూపు..

అప్పటి గుర్తులు రానురాను శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. 30 అడుగుల వెడల్పు ఉండే బురుజు ఇప్పుడు 10 అడుగులుగా మారింది. అలాగే వీర్ల దేవాలయ ప్రాంతంలో వీరాచార వంతుల కోసం నిర్మించిన సత్రపు గదులు శిథిలావస్థలకు చేరాయి. పల్నాటి వీరారాధన ఉత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వీరాచారవంతులు కేవలం పొంగళ్లు చేసుకుంటున్నారు. వారు విశ్రమించడానికి కూడా వీలు లేకుండా పోయింది. దేవాదాయ శాఖ వీర్ల దేవాలయాన్ని ఆధీనం చేసుకున్నప్పటికీ అభివృద్ధికి మాత్రం శ్రద్ధ చూపడం లేదు. వీరచారవంతులకు విశ్రాంత గదులు, పొంగళ్లకు ప్రత్యేక గదులు, పీఠాధిపతికి ప్రత్యేక కార్యాలయం కోసం ప్రతిపాదనలు ఉన్నా కాగితాలకే పరిమితమయ్యాయి. అయితే కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యాన వీర్ల దేవాలయం చుట్టూ ప్రహరీగోడతోపాటు చాపకూడు మందిరం నిర్మించి చేతులు దులుపుకున్నారు. వీటన్నిటిని సంరక్షించి భావితరాలకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గత ఏడాది వీరారాధన ఉత్సవాల సందర్భంగా మాలమహానాడు వర్గీయులు కన్నమదాసు మేడ ఆక్రమణకు గురికాకుండా చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి కన్నమదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

సజీవ సాక్ష్యాలకు రక్షణ కల్పించాలి

తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, పీఠాధిపతి

పల్నాటి యుద్ధానంతరం బ్రహ్మనాయుడు అప్పగించిన వీరాచార పీఠానికి పిడుగువంశం వారిని పీఠాధిపతులుగా నియమించారు. ఆనాటి నుంచి ప్రతి సంవత్సరం కార్తీక అమావాస్య నుంచి ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వీరాచారవంతులు వచ్చి పూజలు జరుపుతారు. మిగిలిన రోజుల్లో వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు వచ్చి వీటిని సందర్శిస్తారు. అయితే నాటి చరిత్ర చిహ్నాలు కాలగర్భంలో కలిసిపోకుండా ప్రభుత్వం రక్షణ కల్పించాలి.




కన్నమదాసు మేడ


బ్రహ్మనాయుడు మేడ


కోట బురుజు


అంకాళమ్మ దేవాలయం

నేడు సరస్వతీ భూములను పరిశీలించనున్న పవన్ కల్యాణ్

పిడుగురాళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా మాచవరం మండలం చెన్నాయపాలెం సమీపంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ కుటుంబానికి చెందిన సరస్వతీ భూములను మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గతవారం సరస్వతి భూములలో రెవెన్యూ, అటవీ, మైనింగ్ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. కొన్ని ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా సరస్వతి భూములు జగన్ కుటుంబం కలిపేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా పరిశ్రమ పేరుతో కొన్నేళ్ల క్రితం భూములు కొనుగోలు చేసి పరిశ్రమను నిర్మించకపోవడంతో అనేకమంది ఉపాధి అవకాశాలు లేకుండా పోవడంపై కూడా ఇటీవల పెద్ద ఎత్తున రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సరస్వతి భూముల పరిశీలన కోసం వస్తుండడం చర్చనీయంగా మారింది. సోమవారం రాత్రి బాగా పొద్దుపోయాక పవన్ కల్యాణ్ పర్యటనకు సంబంధించిన సమాచారం అందినట్లు అధికారులు ధ్రువీకరించారు. తగిన బందోబస్తు, రోడ్డు మ్యాప్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

అండర్ - 19 బాల బాలికల ఫెన్సింగ్, హాకీ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 బాల బాలికల ఫెన్సింగ్, హాకీ జిల్లా జట్ల ఎంపిక మండలంలోని నందిగామ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో సోమవారం జరిగాయి. 130 మంది క్రీడాకారులు హాజరయ్యారని, జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలో జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు తెలిపారు. ఫెన్సింగ్ బాలుర జట్టు ఈప్సి విభాగంకు ఎం.దేవేందర్, కె.తేజేశ్వర్‌నాథ్, పి.ఇంద్రసేనారెడ్డి, ఎం.సంతోష్, పాయిల్ విభాగంకు డి.డానిజాష్, ఎల్.వివేక్ రాజ్, ఎస్.కిరణేశ్వరరెడ్డి, ఎన్.గోపీచంద్, తాబర్ విభాగంకు డి.డానియేల్ నిహాల్, ఎస్.గగన్ ధీర్, షేక్ మహీర్, ఆర్ త్రివేంద్ర ఎంపికయ్యారు. బాలికల పాయిల్ విభాగంకు పి.పల్లవి, సీహెచ్ అదాష్, పి.బ్యూల, ఎ.మహేశ్వరి, తాబర్ విభాగంకు పి.అనూరాధ, కె.నాగజ్యోతి, సీహెచ్ రిజ్వా, పి.జెస్సిక, ఈప్సి విభాగంలో ఇ.అక్షిత, వి.సిరి చందనరెడ్డి, బి.స్వాతి, షేక్ జాస్మిన్ ఎంపికయ్యారు. హాకీ బాలుర జట్టుకు వై.చంటి, షేక్ ఉమర్ ఫరూక్, టి.వెంకట కృష్ణ, కె.హరిహరన్, ఎం.శివమణి, కె.సాగర్ బాబు, కె.విజయ చోళుడు, వి.భార్గవ్, వై.చిరంజీవి, వి.బాలమణికంట, టి.మహేష్ బాబు, వి.జాకోబు, షేక్ హనీఫ్, షేక్ రియాజ్, కె.ఎస్ఎస్‌వీ కార్తీక్ కుమార్, షేక్ ఇమామ్‌సా, జి.సంతోష, స్టాండ్ బైగా వైలక్ష్మీ ప్రసాదు, పి.సాంబశివరావు, పి.సాయి హర్షవర్ధన్ రెడ్డి ఎంపికైయ్యారు. బాలికల హాకీ జట్టుకు ఎస్‌కే.జాస్మిన్, ఎన్.ఉమా మాధవి, సీహెచ్ జ్ఞాన శ్రీఅర్చన, ఎన్.రమ్య, కె. త్రివేణి, షేక్ ఆసిఫా, షేక్ సుల్తానా, ఎ.హరిక, డి.స్వరూప, ఆర్ లీలా ప్రసన్న, వి.లావణ్య, కె.లక్ష్మీదుర్గ, ఎ.ఈశ్వరి లక్ష్మి, బి.దుర్గా మహేశ్వరి, వై.శిరీష, కె.గాయత్రి, జి. కుసుమ, వి.శ్రీనాగ ప్రసన్న లక్ష్మి, స్టాండ్ బైగా షేక్ సుహాన, షేక్ ఆసిఫా, పి.శ్రావణి ఎంపికైయ్యారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 587.00 అడుగులు ఉంది. ఇది 305.74 టీఎంసీలకు సమానం. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 46,506 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

TENALI MUNICIPALITY

E-procurement Short Tender Notice

E-procurement Short Tender notice No.15/2024-25/General Funds, Online tenders are hereby invited from the contractors/ contracting agencies for No. of tender Works: 5 for Estimated Amount Rs.62.65 Lakhs. The tender document is available for download from 05.11.2024 (04.00pm) onwards and last date for bid submission for tender is on 12.11.2024 (3.00pm) & 12.11.2024 (03.30pm) Further details can be seen at 'e' procurement market Place i.e., "www.apeprocurement. gov.in".

Sd/- COMMISSIONER, TENALI MUNICIPALITY

బర్నబాస్ హత్య కేసు సీఐడీకి బదిలీ

- పొన్నూరులో చర్చనీయాంశం
- ఇకనైనా వాస్తవాలు వెలుగు చూస్తాయని ఆశాభావం



బర్నబాస్ (ఫైల్ ఫొటో)

పొన్నూరుటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన రేషన్ బియ్యం వ్యాపారి అంజి బర్నబాసు హత్య కేసును కూటమి ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేసినట్లు సమాచారం. గతేడాది అక్టోబరు నెలలో రేషన్ బియ్యం వ్యాపారి, దళితుడైన బర్నబాసు హత్య జరిగింది. 2019-2024 మధ్య కాలంలో రేషన్ మాఫియాకు పొన్నూరు అడ్డాగా మారింది. అప్పటి పాలకుల అండదండలతో పొన్నూరులో రేషన్ మాఫియా యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగించింది. అయితే వ్యాపారుల మధ్య విభేదాలు అంజి బర్నబాసు హత్యకు దారితీశాయి. ఈ హత్య రాష్ట్ర స్థాయిలో పెను సంచలనంగా మారింది. నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ సైతం ఎన్నికల సమయంలో పొన్నూరు వచ్చినప్పుడు బర్నబాసు హత్య కేసును ప్రచార వేదికలపై ప్రస్తావించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బర్నబాసు హత్యపై సమగ్ర విచారణ జరుపుతామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సైతం దళిత సంఘాలకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ కేసు సీఐడీకి బదిలీ కావడంతో పొన్నూరులో చర్చనీయాంశంగా మారింది. హతుడి భార్య నందిని తన భర్త కేసులో సరైన న్యాయం జరగలేదని మొదటి నుంచి ఆరోపిస్తుంది. తన భర్త హత్యలో అప్పటి వైసీపీ ప్రజా ప్రతినిధుల పాత్ర ఉందనీ, నెలవారి మాముళ్ల ఇవ్వలేదని హత్య చేయించారని బాహాటంగానే ఆరోపించటంతోపాటు దర్యాప్తు అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే ఆ సమయంలో అధికార పార్టీ నాయకుల ప్రమేయంపై తీవ్ర ఆరోపణలు రావటంతో పోలీసులు కూడా ఈ కేసు పట్ల ఉదాసీన వైఖరి అవలంబించారన్న ఆరోపణలు వచ్చాయి. దర్యాప్తు అధికారులు 11 మందిని అరెస్టు చేశారు. వారిలో 10 మందిపై రౌడీషీట్లు తెరిచారు. హత్యలో ప్రమేయం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక నాయకులను వదిలివేశారని బర్నబాసు భార్య నందిని ఆరోపించారు. హత్య కేసులో నిందితుల నుంచి పోలీసులు భారీగా వసూళ్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. హత్య కేసుతో సంబంధం లేని రైస్ మిల్లర్లను సైతం ఈ కేసు విషయంలో విజయవాడ పిలిపించుకుని బెదిరించి లక్షలు గుంజారని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై దళిత సంఘాలు పలుమార్లు నిరసన తెలిపినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. హత్యకు గురైన బర్నబాసు సెల్‌ఫోన్‌లో ఎవరెవరికి ముడుపులు అందించారు, రేషన్ మాఫియాతో సంబంధాలు ఉన్న నాయకుల పేర్లు, వివరాలు, కీలక ఫోన్ సంభాషణలు ఉన్నట్లు బర్నబాసు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే హత్య తర్వాత ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులోని విషయాలను నేటికీ బహిర్గతం చేయలేదు. దళితుడు దారుణ హత్యకు గురైతే వైసీపీ నుంచి ఒక్కరు కూడా పరామర్శించడానికి వెళ్లలేదు. హత్య వెనుక వైసీపీ నాయకుల ప్రమేయం ఉండటమే కారణమని దళిత సంఘాలు అనుమానిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించటంతో ఇకనైనా వాస్తవాలు వెలుగు చూస్తాయని హతుడి కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మీరే రండి

(5పేజీ తరువాయి)

నిర్వహించడానికి కూడా బద్ధకిస్తున్నారు. ప్రస్తుతం కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నిక కోసం ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెల 6వ తేదీ వరకు ఓటరుగా నమోదు అయ్యేందుకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నది. ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్న వారివి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించే బాధ్యతని బీఎల్‌వోలకు ఎన్నికల సంఘం అప్పగించింది. ఈ బీఎల్‌వోలలో చాలామంది సచివాలయాల సెక్రెటరీలు ఉన్నారు. బీఎల్‌వోలుగా ఎవరైతే అడ్మిన్ సెక్రెటరీలున్నారో వారు ఇంటింటికి వెళ్లి ఓటరు దరఖాస్తులను పరిశీలించేందుకు ఇష్టపడటం లేదు. ఎవరైనా తమ ఆఫీసుకు రావాల్సిందేనన్న ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఈ విషయంలో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్ జారీ చేసిన ఆదేశాలు కూడా వారి చెవికెక్కడం లేదు. సోమవారం గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలు డోర్-టూ-డోర్ వెరిఫికేషన్‌కు వెళ్లకుండా తాపీగా ఆఫీసుల్లోనే కూర్చుని రమ్మని ఫోన్లలో సమాచారం ఇచ్చారు. కొందరికైతే తామే వస్తామని చెప్పి అన్ని పత్రాలను సిద్ధంగా పెట్టి ఉంచుకోవాలని చెప్పి తీరా ముఖం చాటేశారు. ఆఫీసులకు వెళ్లకుండా చాలామంది గంటల తరబడి నిరీక్షించినా బీఎల్‌వోలు రాకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. దీనిపై ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బీఎల్‌వోలపై చర్యలు తీసుకుంటాం



పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవడం వరకే వారి పని. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన బాధ్యత బీఎల్‌వోలదే. బీఎల్‌వో అంటేనే బూత్ స్థాయి అధికారి అని. ఇప్పటికే టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఈ విషయంలో స్పష్టంగా ఆదేశాలు జారీ చేశాం. ఆరు జిల్లాల్లో ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకొంటాం. అవసరమైన డిసిప్లినరీ యాక్షన్ చేపడతాం.

\- ఎన్ఎస్‌కే ఖాజావలి, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, గుంటూరు డీఆర్‌వో

గుంతల రోడ్లకు మోక్షం!

(5పేజీ తరువాయి)

వుంది. ఈ నేపథ్యంలో తక్షణ మరమ్మతులపై ప్రభుత్వం, ఆర్ అండ్ బీ శాఖ దృష్టి సారించాయి.

- గుంటూరు జిల్లాకు.. 11.93 కోట్లు

విభజిత గుంటూరు జిల్లాలో రహదారుల మరమ్మతులు, గుంతలు పూడ్చి తాత్కాలిక ప్యాచ్‌లు వేయడం కోసం ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. వివిధ దశల్లో చేపట్టే ఈ పనులకు రూ. 11.93 కోట్లు కేటాయించారు. గుంటూరుజిల్లాలో 17 మేజర్ జిల్లా రహదారుల తక్షణ మరమ్మతుల కోసం రూ. 5.78 కోట్లు, 7 రహదారుల్లో ప్యాచ్ వర్కుల కోసం రూ. 73 లక్షలు విడుదల చేశారు. వింజమూరు, పల్లెపాడు, వడ్లమూడి, సాలపాడు, నారాకోడూరు, అనంతవరపాడు జిల్లా రోడ్లలో తక్షణ మరమ్మతుల కోసం మరో 55 లక్షలు, పెదనందిపాడు- బాపట్ల, పొన్నూరు- కాకుమాను, గుంటూరు- అమరావతి, మాచవరం- అల్లూరు, గుంటూరు- తెనాలి రాష్ట్ర రహదారుల తక్షణ మరమ్మతులకు 352 కోట్లు, కొల్లూరు- కొల్లిపర, గుంటూరు చీరాల రోడ్లలో ప్యాచ్ వర్కుల కోసం రూ. 55లక్షలు కేటాయించారు. గుంటూరు- పర్చూరు రాష్ట్ర రహదారికి రూ. 60లక్షలు, గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాల్లో రహదారుల మరమ్మతుల కోసం మరో రూ. 20 లక్షలు, పొన్నూరు- కాకుమాను రోడ్డులో కల్వర్టు కోసం రూ. 12లక్షలు, కేటాయించారు.

- బాపట్ల జిల్లాకు 16.83 కోట్లు

బాపట్ల జిల్లాలో అద్దంకి- కొణికి, మాచవరం- అల్లూరు, తెనాలి- చందోలు, బాపట్ల- సూర్యలంక, బ్రాహ్మణకోడూరు- భట్టిప్రోలు- రేపల్లె రాష్ట్ర రహదారుల మరమ్మతుల కోసం రూ. 80.5 లక్షలు, గుంటూరు- చీరాల రహదారి ప్యాచ్ వర్కు కోసం రూ. 72.5 లక్షలు, రేపల్లె- నిజాంపట్నం రోడ్డులో కల్వర్టు కోసం రూ. 34 లక్షలు కేటాయించారు. వేమూరు నియోజకవర్గంలో బ్రాహ్మణ కోడూరు- భట్టిప్రోలు రోడ్డుకు, అద్దంకి నియోజకవర్గంలో అద్దంకి- సంతమాగులూరు రోడ్డుకు, పర్చూరు నియోజకవర్గంలో ఇంకొల్లు- పంగులూరు, చీరాల- ఒంగోలు, బాపట్ల- పర్చూరు, పర్చూరు- జాగర్లమూడి రాష్ట్ర రహదారుల మరమ్మతులకు రూ. 155 లక్షలు కేటాయించారు. బాపట్ల జిల్లాలో 32 జిల్లా రహదారుల్లో మరమ్మతుల కోసం రూ. 1060.70 లక్షలు(10.61 కోట్లు), ప్యాచ్ వర్కుల కోసం రూ. 70 లక్షలు, మరో 13 రోడ్లకు మరమ్మతుల నిమిత్తం రూ. 176 లక్షలు, ప్యాచు వర్కులకు రూ. 35 లక్షలు కేటాయించారు.

- పల్నాడు జిల్లాకు.. 6.65 కోట్లు

నరసరావుపేట డివిజన్ పరిధిలో 8 జిల్లా మేజర్ రహదారులకు మరమ్మతుల కోసం రూ. 223.9 లక్షలు, 13 రోడ్లలో ప్యాచ్ వర్కుల కోసం రూ. 142.2 లక్షలు, కొండవీడు ఘాట్ రోడ్డు కోసం రూ. 6 లక్షలు, మాచర్ల- గుటూరు జిల్లా రహదారికి మరమ్మతుల కోసం రూ. 40 లక్షలు కేటాయించారు. ఈ జిల్లాలో రాష్ట్ర రహదారుల్లో 7 చోట్ల మరమ్మతుల కోసం రూ. 172.5లక్షలు, ప్యాచ్ వర్కుల కోసం రూ. 79.85 లక్షలు కేటాయించారు. అయితే ఇప్పటికే ఆయా జిల్లాలో మరమ్మతు పనులు చేపట్టారు. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. పలు నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ముందుకు నడిపిస్తున్నారు.

పాఠశాల నుంచి విద్యార్థులు పారిపోవడం దురదృష్టకరం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

యడ్లపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల నుంచి విద్యార్థులు పారిపోవడం దురదృష్టకరమని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. యడ్లపాడు మండలం బోయపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను ఆమె సోమవారం సందర్శించారు. ఈ నెల 1వ తేదీన పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు పారిపోయిన సంఘటనపై విచారణ జరిపేందుకు వచ్చిన ఆమె ముందుగా అన్ని తరగతుల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలోని పరిస్థితులు, ఉపాధ్యాయులు అందిస్తున్న ఆహారం, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బోయపాలెం పరిధిలోని గురుకుల పాఠశాల యాజమాన్యం నిర్వహణలో పూర్తిగా వైఫల్యం చెందడం వలనే ఈ సమస్యలు తలెత్తాయన్నారు. విద్యార్థులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక, చెప్పినా ఆలకించేవారు లేకపోవడంతోపాటు దండిస్తుండటంతో పారిపోవడం అనే దారిని ఎంచుకున్నారని వివరించారు. ఇటీవల సుమారు 20 మంది విద్యార్థులను క్రమశిక్షణ పేరుతో యాజమాన్యం ఇళ్లకు పంపించేసిందనీ, అలా పంపించడం బాలలకు ఉన్న హక్కులను హరించి వేయడమేనన్నారు. విద్యార్థులు తమ సమస్యలను తెలియజేసేందుకు ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టెను పెట్టాలని విద్యాశాఖ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రతి నెలా ఎంఈవో లేదా ఎంఎస్‌కేలు ఫిర్యాదులను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేయాల్సి ఉందన్నారు. అయితే పాఠశాలలో అలా జరగడం లేదని, దీంతో విద్యార్థులు ఒత్తిడిలోనై పాఠశాల నుంచి పారిపోతున్నారన్నారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ స్థానికంగానే ఉండి పర్యవేక్షించాల్సి ఉందన్నారు. అయితే వారు స్థానికంగా ఉండకపోవడంతో ఈ సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. సీడీపీవో శాంతకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జోజమ్మ ఉన్నారు.

పోషకాలు తెలుసుకునేందుకే ఆల్ఫా స్పెక్ట్రల్ ల్యాబ్

- వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వైస్ చైర్మన్ విజయ్ కుమార్

గుంటూరు సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికార సంస్థ ఏపీసీఎన్ఎఫ్ ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం వల్ల నేల సారూప్యంలో భారీ మార్పులు చోటు చేసుకొంటున్న నేపథ్యంలో నేలలో ఉన్న పోషకాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే ఎంఐఆర్ ఆల్ఫా స్పెక్ట్రల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ తెలిపారు. ఈ పరిశోధనలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. రైతు సాధికార సంస్థ, ఐజి గార్ల్ సంయుక్తంగా కెఎఫ్‌డబ్ల్యూ సహకారంతో సోమవారం లాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో భూమిలోని పోషకాలను తెలుసుకొనేందుకు ఏర్పాటు చేసిన ఎంఐఆర్ ఆల్ఫా స్పెక్ట్రల్ ల్యాబ్‌ను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఫలితాలు పరిశోధనల ద్వారా దేశవ్యాప్తంగా తెలియజేయాలని అభిప్రాయపడ్డారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక రకాల ప్రయోజనాలు కలుగుతున్నాయని, అందుకు తగినట్లుగా పరిశోధనలను విస్తృత పరచాలని సూచించారు. భూమిలో అనేక రకాల శాంపిల్స్ తీసుకొని ఈ ల్యాబ్ ద్వారా పరిశోధన చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ శారద జయలక్ష్మి దేవి, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్ పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత

పెదకాకాని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని డ్రోన్ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ఏపీ డ్రోన్ కార్పొరేషన్, ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ, డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన అమరావతి డ్రోన్ హెక్తాన్- 2024లో పాల్గొన్న వారికి సోమవారం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టర్ ఆచార్య కె.రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం లు ప్రశంసా పత్రాలను అందజేశారు.

రేపు బాపట్ల, పల్నాడు కాంగ్రెస్ నేతలతో ఏపీసీసీ చీఫ్ షర్మిల సమావేశం

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లాల నేతలతో వరుస సమావేశాలు నిర్వహించేందుకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోజువారీ షెడ్యూల్ ప్రకటించారు. ఇందులో భాగంగా ఈనెల 6న బాపట్ల, నరసరావుపేట జిల్లాల నాయకులతో విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బాపట్ల, నరసరావుపేట జిల్లాల నేతలకు సమాచారం అందించారు. ఇటీవల జిల్లాలకు నూతన కాంగ్రెస్ అధ్యక్షులను నియమించిన ఆమె కొత్తగా అనుబంధ విభాగాల నియామకాలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు వంటి అంశాలపై చర్చించనున్నట్లు నేతలు తెలిపారు.

పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సదరన్ ప్రైవేట్ లెక్చరర్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌టీఎల్‌టీవో) ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా పురస్కారాల కోసం మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రైవేట్ స్కూలు, కాలేజి డైరెక్టర్లు, మహిళ ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ కాలేజి, డిగ్రీ కాలేజి విశ్వవిద్యాలయ ఆచార్యులు, సహచరులు డిసెంబర్ 25లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవార్డుల ప్రదానం జనవరిలో గుంటూరులో నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం 949929674, 7989088274లో సంప్రదించాలని సూచించారు.

ఇసుక పోసినందుకు కూలి మాత్రమే తీసుకోవాలి

- సబ్‌కలెక్టర్ సంజనసింహ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లిపర, నవంబరు 4 (ఆంధ్రజోతి): ఉచిత ఇసుకపై గందరగోళంగా ఉందని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించడంతో సబ్‌కలెక్టర్ సంజనసింహ సోమవారం మండల పరిధిలోని మున్నంగి ఇసుకరీచ్‌ని తహసీల్దార్ సిద్ధార్థతో కలిసి ఆమె తనిఖీ చేశారు. కూలీలతో, ఇసుక వినియోగదారులతో మాట్లాడారు. ఇసుకను ట్రాక్టర్‌లో పోసినందుకు ఎంత వసూలు చేస్తున్నారని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంజనసింహ మాట్లాడుతూ ట్రాక్టర్‌లో ఇసుక పోసినందుకు రూ.600 మాత్రమే తీసుకోవాలన్నారు. అదనంగా వసూలు చేస్తే వారి పట్ల తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు కూడా అదనంగా వసూలు చేసినట్లు తెలిస్తే ఆ వాహనాన్ని సీజ్ చేస్తామన హెచ్చరించారు. కృష్ణానదిని ఆనుకుని ఉన్న పరిసర ప్రాంతాల వారికే ఇసుకను ట్రాక్టర్లు, ఎండ్ల బండ్లకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. తెనాలి, గుంటూరు దూర ప్రాంతాల వారు ఇసుకను తీసుకెళ్లడానికి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడనున్నట్లు తెలియజేశారు.

సీఎంపై అభ్యంతరకర పోస్టు పెట్టారంటూ ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుపెట్టారని వారిపై చర్యలు తీసుకోవాలని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన ఆల్ల జగదీష్ రెడ్డి అనే వ్యక్తి సోషల్ మీడియాలో సీఎం ఫేసు మార్ఫింగ్ చేసి ప్రజల్లో ఆయన ప్రతిష్ట దెబ్బతినేలా అభ్యంతరకర పోస్టు పెట్టాడని తెనాలి టీడీపీ బీసీ సెల్ నాయకుడు పణిదపు దుర్గ ఫిర్యాదు చేశాడు. పోస్టు చేసిన వ్యక్తికి సంబంధించి సోషల్ మీడియా స్క్రీన్ షాట్స్, ఇతర ఆధారాలు పోలీసులకు అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పురుగుమందు తాగి ఆత్మహత్య

కారంపూడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కాచవరంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన చిలకల వెంగళరెడ్డి (30) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో శనివారం గ్యార్మీ పండగ సందర్భంగా ముస్లిం యువత జూనియర్ ఎన్టీఆర్ సినిమా పాటలకు నృత్యాలు చేస్తూ ఊరేగింపు జరిపారు. అయితే వెంగళరెడ్డి ఊరేగింపును అడ్డగిస్తూ జూనియర్ ఎన్టీఆర్ పాటలు ఎందుకు పెట్టారంటూ ముస్లిం యువతతో వాదనకు దిగాడు. దీంతో మాటా మాటా పెరిగి వివాదం చోటుచేసుకుంది. అయితే ఈ సంఘటనపై వెంగళరెడ్డి దమ్ముంటే చూసుకుందాం రండిరా అంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. దీంతో ముస్లింలు, గ్రామస్తులు కొందరు కారంపూడి పోలీస్‌స్టేషన్లో వెంగళరెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై వెంగళరెడ్డికి ఆదివారం మహిళా కానిస్టేబుల్ ఫోన్ చేసి పోలీస్‌స్టేషన్‌కు రమ్మని కోరింది. దీంతో వెంగళరెడ్డి సోమవారం గ్రామ శివారులోని పొలాల్లోకి వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడుపై ఫిర్యాదు

తాడేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం, ప్రాతూరు సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు యాజమాన్యం సదరు ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించి తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు వారం క్రితం ఉపాధ్యాయుడు పాఠశాలలోని ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించగా సదరు విద్యార్థిని ఈ విషయాన్ని తలిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లింది.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

వినుకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో సోమవారం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. ఏనుగుపాలెం రోడ్డులోని గుర్తుతెలియని వృద్ధుడు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు వచ్చి 108 సాయంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు వయసు 70 ఉండవచ్చు. మృతదేహాని వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లోని మార్చురీకి తరలించారు. వివరాలకు సీఐ శోభన్ బాబును 9440796248 సంప్రదించాలని తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం రూ 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి రూ 29,754 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద రూ 26,754 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి. దీనిలో 16వేల క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా నదికి వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

35,381 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 40,989 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 35,381 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,765 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	8500	16000
నెంబరు. 5	8500	13500	నెంబరు. 5	--	--
273	10000	12500	273	11500	13000
341	10000	16000	341	11000	13000
4884	10500	14000	4884	12600	17000
సూపర్ 10	11500	11500	సూపర్ 10	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18300	తేజ	8000	17800
బ్యాడిగి	8000	16000	బ్యాడిగి	8800	13000
దేవనూరు డీలక్స్	10000	14500	దేవనూరు డీలక్స్	12500	13000
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	11000

ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

- టాటా పవర్ హోమ్ సోలార్ సిస్టమ్స్ సేల్స్ ప్రమోషన్ కొరకు P/T, F/T మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలీకాలర్స్, టెక్నికల్ & బిజినెస్ అసోసియేట్స్, ఏజెంట్స్ కావలెను. ఆకర్షణీయమైన ఆదాయం. సంప్రః 9392227337. AJG-203543
- గుంటూరు, పరిసర ప్రాంతాలలో ప్రముఖ పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు యువకులు కావలెను. Q: డిగ్రీ, జీతం : 15,000 /- TA+DA -3000, (టూ వీలర్ కావలెను). సంప్రః 8185046367. AJG-203567
- మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను MBA పాసైన, పాస్ కాకపోయిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు యువతి / యువకులు కావలెను. స్వయంగా కలవండి. శాంతి ఆర్ట్స్ గ్యాలరీ, 4/3 అరండల్‌పేట, బ్యాంక్ ఆఫ్ బరోడా బిల్డింగ్ 2వ ఫ్లోర్, గుంటూరు. సెల్ : 99480 84001. AJG-203538

అమ్మకము

- German Shepherd Puppies, Double Coat Excellent Breed for Sale. Contact No: 89199 41974 AJG-203651

SERVICES

- ఖాళీ స్థలాలపై లోన్స్/హోమ్ లోన్స్/ప్రోపర్టీ లోన్స్/బిజినెస్ లోన్స్/పర్సనల్ లోన్స్/ టేకోవర్ లోన్స్ - 20 సం. వరకు చేయబడును. సిబిల్ అవసరం లేదు. సంప్రః 73968 33074. AJB -4479

EDUCATION

- APOSS ద్వారా డైరెక్ట్ - 10th / ఒకే సం॥లో ఇంటర్, దూర విద్యా ద్వారా BA / B.Com, B.Sc / M.A / M.Sc / MBA/ MCA. శ్రీ వర్షిని, 2/6, బ్రాడీపేట, గుంటూరు-2, ఫోన్ : 0863-2246006 / 9440214612 / 9553534072 / 9652146801. RK-1825

CHANGE OF NAME

- We Shamgar Philip Dumpala (father), Anie Divya Kanthi Gera (Mother) residing at 26-27-44, Fathimanagar, Guntur. We have changed our minor daughter name from Joanna Shiloh Dumpala (old name) to Joanna Israel Dumpala (new name), hence she will be called as Joanna Israel Dumpala for all future purposes. AA-30

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

- బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్రః : 88024 89999 AJB-194330

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు

ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు


99854 03281

సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	98852 71281
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నకరికల్లు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు 'ప్రజల చెంతకు మీ ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్టు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయవర్గాలు సోమవారం ఒకప్రకటనలో పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

సీఎంని కలిసిన జంగా

పిడుగురాళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి బోర్డు సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సోమవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు పిడుగురాళ్ల జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య కూడా వున్నారు.

ఆర్టీసీ నూతన సర్వీసు ప్రారంభం

పిడుగురాళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోలో పిడుగురాళ్ల నుంచి గుంటూరుకు పల్లె వెలుగు నూతన సర్వీసును ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. డిపో అభివృద్ధికి తగు ప్రణాళికలు ఇవ్వాలని కోరారు. అనంతరం బస్సులో ఆర్టీసీ సిబ్బంది, కూటమి నేతలతో కలిసి కొంత దూరం ప్రయాణించారు.

సోషల్ ఆడిట్‌ను

సక్రమంగా నిర్వహించాలి

మాచర్లటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోషల్ ఆడిట్‌ను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో ఫణికుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా సోషల్ ఆడిట్ జరగాలన్నారు. స్టేట్ రీసోర్స్ పర్సన్ జేఎస్ రాజు సోషల్ ఆడిట్‌పై పలు విషయాలను వివరించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఏపీవో నాగ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పశు గర్భకోశ వైద్యశిబిరం

దుర్గి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గి పశువైద్యశాలలో సోమవారం పశుగర్భకోశ వైద్యశిబిరం నిర్వహించారు. పశు సంవర్థక శాఖ ఏడీఏ జగదీష్‌బాబు పాల్గొని మాట్లాడుతూ పశువులు గర్భం దాల్చేందుకు మందులు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 21నుంచి పశుగణన ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిబిరంలో పశువైద్యాధికారులు దిలీప్, నాగవల్లిశివ, పశుపోషకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు

512 దరఖాస్తులు

రెంటచింతల,నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం సాయంత్రం వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఓటు నమోదు కోసం 512 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ నగేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వరకు ఓటు నమోదుకు అవకాశం ఉందని, ఓటు నమోదు చేసుకోని పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

21 నుంచి పశుగణన

క్రోసూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 21 నుంచి పశుగణన కార్యక్రమం ప్రారంభం కానుందని, 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఇది కొనసాగుతుందని ఎంపీడీవో బిక్కి మహేష్ బాబు తెలిపారు. సోమవారం 21వ అఖిల భారత పశుగణన పోస్టర్లను, స్టిక్కర్లను వెటర్నటీ సిబ్బందితో కలసి ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటయ్య, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణిత శాస్త్రవేత్త

శకుంతాలదేవికి నివాళి

పెదకూరపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఖగోళ, జ్యోతిష్య శాస్త్రవేత్త శకుంతలాదేవి జయంతిని సోమవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కాకాని వెంకట రమణ మాట్లాడుతూ శకుంతాలదేవిని హ్యూమన్ కంప్యూటర్ అని కూడా పిలుస్తారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకులు మారుతున్నా..

మారని బతుకులు

- అభివృద్ధికి ఆమడదూరంలో అడిగొప్పుల ఎస్సీ కాలనీ
- నిత్యం సమస్యలతో సతమతం
- మురికివాడలను తలపిస్తున్న వీధులు
- పది హేనేళ్లుగా తాగునీరు కొనుగోలు
- మౌలిక సదుపాయాలు కల్పించాలని పాలకులకు స్థానికుల వేడుకోలు



అధ్వానంగా దర్శనమిస్తున్న కాలనీలోని అంతర్గత రహదారి

పగలంతా పొట్ట కూటి కోసం పోరాటం.. రాత్రయితే దోమలు, విషసర్పాలతో సహవాసం.. మురికి వాడలను తలపిస్తున్న వీధులు.. తాగునీటిని సైతం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.. ఒకట్రెండు కాదు పది హేనేళ్లుగా ఇదే దుస్థితి.. పాలకులు మారుతున్నా అభివృద్ధి మాత్రం శూన్యం.. మండలంలోని అడిగొప్పుల ఎస్సీ కాలనీ దుస్థితి ఇది.

దుర్గి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పుల ఎస్సీ కాలనీలో దాదాపు 100 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా రోజు వారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కాలనీలోని వీధులన్నీ మురికి వాడలను తలపిస్తున్నాయి. సైడుకాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరు పొంగి పొర్లుతూ రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. వర్షం పడిందంటే వీధులన్నీ బురద మయంగా మారుతున్నాయి. రాత్రివేళ దోమలు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయి. దీనికితోడు విష సర్పాల సంచారం కూడా అధికంగా ఉంది. దీంతో రాత్రయితే కాలనీ వాసులు భయం గుప్పిట బతుకు వెళ్లదీస్తున్నారు.



నీటిని సైతం కొనుక్కోవాల్సిందే..

30 యేళ్ల క్రితం ఏర్పడిన ఈ కాలనీలో 15 సంవత్సరాల క్రితం ప్రభుత్వం మినీ వాటర్ ట్యాంకు, ఓ బోరును ఏర్పాటు చేశారు. బోరు కొద్ది రోజులకే మరమ్మతులకు గురైంది. దీంతో పదిహేనేళ్లుగా కాలనీ వాసులు ప్రైవేటు బోర్ల యజమానులకు నెలకు ఇంటికి రూ. 500 చొప్పున అందజేసి నీటిని కొనుగోలు చేస్తున్నారు.

అధికారులు స్పందించడం లేదు



- రాయపాటి బొగ్గయ్య, కాలనీ వాసి

కాలనీ ఏర్పడిన నాటి నుంచి ఇక్కడే జీవిస్తున్నాం. కనీస సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. తాగు నీటిని నెలకు రూ.500 పెట్టి కొనాల్సి వస్తోంది. మా సమస్యలపై అధికారులకు విన్నవించుకున్నా స్పందించడం లేదు.

దోమలతో ఇబ్బంది పడుతున్నాం



- మేరి, కాలనీ వాసి

రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు మావి. రాత్రయితే దోమలతో ఇబ్బంది పడుతున్నాం. తెల్లారితే నీటి కోసం అగచాట్లు తప్పడం లేదు. దోమలు, పాముల భయంతో రాత్రయితే కంటి మీద కునుకు ఉండటం లేదు.

అధికారుల దృష్టికి ఎన్నిమార్లు తీసుకెళ్లినా కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- పత్తి పంటకు మద్దతు ధర కల్పిస్తాం
- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
- పిడుగురాళ్లలో సీసీఐ కేంద్రం ప్రారంభం



సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని గురజాల ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు భరోసానిచ్చారు. సోమవారం పిడుగురాళ్ల పట్టణంలో సీసీఐ కేంద్రాన్ని ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటకు మద్దతు ధర కల్పిస్తామని, తక్కువ ధరకు పంటలను అమ్ముకోవద్దని, ధర వచ్చేవరకు పంటను గిడ్డంగులలో నిల్వవుంచుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని రైతులకు సూచించారు. సీసీఐ కేంద్రానికి వచ్చే రైతులను ఇబ్బంది పెట్టకుండా, సాకులు, కొర్రీలు వేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పులుకూరి కాంతారావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, మార్కెట్‌యార్డు కార్యదర్శి కే.ఈశ్వరరావు, మైలపల్లి సోమయ్య, అమరలింగయ్య, బయ్యర్ సాంబశివరావు, సూపర్‌వైజర్ మాగంటి సాంబశివరావు, డిఇఓ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

రూ. 25 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లు అందజేత

నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స ఖర్చుకోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కి దరఖాస్తు చేసుకున్న 19 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25 లక్షలు చెక్కులను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, మల్లెల ఆదినారాయణ, కోట హరి, మాలపాటి మల్లయ్య, సయ్యద్ అమీర్‌అలి, వడ్డవల్లి సాంబశివరావు, చింతలపూడి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధిక రేట్లకు విక్రయిస్తే

కఠిన చర్యలు తప్పవు

బెల్లంకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఎరువులు, పురుగు మందులను అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంకొండ ఏవో కృష్ణయ్య దుకాణదారులను హెచ్చరించారు. సోమవారం బెల్లంకొండలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి పురుగు మందుల దుకాణంలో వ్యవసాయాధికారులు తనిఖీ నిర్వహించి వివిధ మందుల శ్యాంపిళ్లను సేకరించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతి దుకాణం వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులను విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారం అందితే ఆయా ఆ షాపులను సీజ్ చేయటంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారులు, దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వ్యవసాయంపై

రైతులకు అవగాహన

ముప్పాళ్ళ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం చాగంటివారిపాలెంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, వనరులు, పంటలు, సమస్యలు, గ్రామ చరిత్ర తదితర అంశాలతో రంగ వల్లులను దిద్ది అవగాహన కల్పించారు. గ్రామంలోని భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఏయే పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించటంతో పాటు, ధరలు బాగుంటాయో ఆయా పంటల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు శైలజ, కే నాగమణి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

కార్యకర్తలకు భరోసా సభ్యత్వం

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం ప్రతి కార్యకర్తకు భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రూ.100 చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షలవరకు ప్రమాదబీమా, కుటుంబ సభ్యులకు విద్యా, ఉద్యోగ, వైద్యసాయం అందుతుందన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీచేయని విధంగా కార్యకర్తల సంక్షేమం కోసం కోట్లాదిరూపాయలు వెచ్చిస్తున్న ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. మార్కెట్‌యార్డులో పనిచేసే ముఠా కూలీలు కన్నా చేతుల మీదుగా టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బలిజేపల్లి సురేష్ కుమార్, నూర్ బాషా జానీ బాబు, పూజల వెంకట కోటయ్య, అనుమోలు జయరామ్ పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న రామస్వామి

మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామ స్వామి సోమవారం లక్ష రూపాయలు చెల్లించి తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. కార్యకర్తలంతా వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఈ సందర్భంగా రామస్వామి శ్రేణులకు పిలుపు నిచ్చారు.

నీటి సంఘాల పదవులకు

ఏకాభిప్రాయంతోనే ఎంపిక

- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాగు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుడి ఎన్నికలతో పాటు డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటి) చైర్మన్ పదవుల ఎంపికను పార్టీ శ్రేణుల ఏకాభిప్రాయం ద్వారానే భర్తీ చేసుకుందామని, ఈ విషయంలో పార్టీ నేతల నిర్ణయమే ఫైనల్ అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రెంటచింతలలో మండలంలోని 7 గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. పదవుల ఎంపికల్లో అందరి ఆమోదంతోనే ముందుకు వెళదామని, సామాజిక సమతుల్యం పాటిద్దామని, పార్టీకోసం కష్టపడిన ప్రతిఒక్కరికి ప్రాతినిధ్యం కల్పిద్దామని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. ఈ విషయంలో తనకు ఎవరిపై, ఏవిధమైన వ్యక్తిగత అభిప్రాయాలు ఏమీ ఉండవని, స్థానిక నేతల అభీష్టమే తనకు ముఖ్యమన్నారు. సాగు నీటి వ్యవస్థను 1997లో టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని, 2015లో తొలిసారి ఎన్నికలను నిర్వహించారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. రెంటచింతలమండలంలో 6 సాగునీటి సంఘాలున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు.

అర్హులైన పట్టభద్రులు

ఓటు నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ళ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గ్రామాల్లో ఓటు నమోదుకి దరఖాస్తు చేయించాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన వీఆర్‌వోల సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు దరఖాస్తుకు ఈనెల 6వ తేదీ వరకే సమయం ఉందని, గ్రామాల్లో పట్టభద్రులను గుర్తించి వారు దరఖాస్తు చేసుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. దరఖాస్తుకు కావాల్సిన వివరాలను వారికి తెలియజేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసాదు, పలువురు వీఆర్‌వోలు ఉన్నారు.



తహసీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నేతలు

క్వింటా పత్తి రూ.10 వేలకు కొనుగోలు చేయాలి

పెదకూరపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాల ద్వారా క్వింటా పత్తిని రూ.10 వేలకు కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దర్శి శేషారావు కోరారు. ఈమేరకు సోమవారం రైతులతో కలసి పెదకూరపాడు తహసీల్దార్ మీసాల డానియేయులకు వినతిపత్రం అందించారు. క్వింటా పత్తికి ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7,521లను రూ.10 వేలకు పెంచాలని శేషారావు డిమాండ్‌చేశారు. కౌలు రైతుల్లో ఎక్కువ మందికి గుర్తింపుకార్డులు అందలేదన్నారు. కార్యక్రమంలో కంభంపాడు మాజీ ఎంపీటీసీ అర్తిమళ్ళ కృష్ణారావు, ఎం.మస్తాన్‌రావు, షేక్ జానీబాషా, ఎం నరసింహారావు, నరేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు

త్వరలో సొంత భవనాలు

ఉమా మహేశ్వరి
క్రోసూరు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవో

ఫటా ఫట్

క్రోసూరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలన్నింటికీ త్వరలో సొంత భవనాలు సమకూరు స్తామని సీడీపీవో ఉమా మహేశ్వరి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితిపై ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్.'

ప్రశ్న : ప్రాజెక్టు పరిధిలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి? సొంత భవనాలు ఎన్ని?

జ : క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 277 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. 102 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. కొత్త భవనాల నిర్మాణం కోసం 70 చోట్ల స్థలాలు సిద్ధంగా ఉన్నాయి.

ప్రశ్న : అంగన్ వాడీ కేంద్రాలు నిర్మించటానికి స్థలాల సమస్య ఏమైనా ఉందా?

జ: 2020లో కొన్ని అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణాలకు స్థలాలు సమకూరాయి. అయితే భవనాలు నిర్మించ లేదు. మళ్ళీ వాటిని రెవెన్యూ అధికా రులతో ఖాయం చేసుకొని కేంద్రాల నిర్మాణానికి ప్రతిపాధనలు పంపిస్తాం.

ప్రశ్న : క్రోసూరు ప్రాజెక్టు కార్యాలయాన్ని 75 తాళ్ళూరులో ఎందుకు ఉంచుతున్నారు?

జ: నిన్న మొన్నటి వరకు ప్రాజెక్టు 75 తాళ్ళూరు కేంద్రాంగానే ఉంది. పేరు కూడా అదే ఉంది. కొన్ని కారణాల వల్ల క్రోసూరు ప్రాజెక్టుగా మార్చారు. కార్యాలయం మార్చటానికి ఉన్నతాధికారులకు ప్రపోజల్స్ పంపించాం.

ప్రశ్న : అంగన్ వాడీ కేంద్రాల పని తీరు ఎలా ఉంది?

జ : కేంద్రాల పని తీరు 70 శాతం సంతృప్తిగా ఉంది. కొన్ని చోట్ల నిర్వాహణ లోపాలు, సమయ పాలన లేక పోవటం, సిబ్బంది షెడ్యూల్‌ను అనుసరించక పోవటం వంటి సమస్యలు ఉన్నాయి.

ప్రశ్న : అంగన్‌వాడీ కేంద్రాలపై తనిఖీలు ఏ విధంగా చేస్తున్నారు?

జ : క్రోసూరు ప్రాజెక్టు పరిధిలో 12 సెక్టార్లు ఉన్నాయి. 10 మంది సూపర్ వైజర్లు కేంద్రాలను నిరంతర తనిఖీలు చేస్తున్నారు. సీడీపీవోగా నేను పలు సందర్భాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాను.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి

- ఇటుక బట్టీలు, అక్రమ లేఅవుట్లపై దృష్టి పెట్టండి
- రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించాలి
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించగా ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ చంద్రవంక సమీపంలో కొందరు ఆక్రమణలు జరిపి ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ చంద్రవంక విస్తీర్ణం ఎంత ఉంది.. ఎంత భూమి ఆక్రమణకు గురైంది తదితర వాటిపై తనకు నివేదిక అందించాలని, చంద్రవంక అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని అధికారులకు సూచించారు. పట్టణంలో అక్రమ లేఅవుట్లను గుర్తించి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెస్టారెంట్లు, హోటళ్లలో దాడులు నిర్వహించి ఆహార నాణ్యత ప్రమాణాలను తనిఖీచేయాలని అధికారులను ఆదేశించారు. ఆజాద్‌నగర్, నెహ్రూనగర్‌లలో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. బుగ్గవాగు నుంచి మాచర్ల పట్టణానికి తాగునీటిని అందించేందుకు రూ.100 కోట్లు మంజూరయ్యాయన్నారు. అలాగే పలువురు కౌన్సిలర్లు వార్డుల్లోని సమస్యలను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అజెండాలో పొందుపరిచిన 7 అంశాలతో పాటు టేబుల్ అజెండాలోని 6 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో కమిషనర్ వేణుబాబు, డీఈ సుభాని, టీపీవో నాగేశ్వరరావు, ఆర్ఐ వెంగయ్య పాల్గొన్నారు.



ఉచిత గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

పేదలకు ఉచిత గ్యాస్ అందించిన ఘనత సీఎం చంద్రబాబుదే

పేదల ఇంటికి ఉచిత గ్యాస్ అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం దీపం పథకం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్‌లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ నేతలు సైదయ్య, దుర్గారావు, కొండలు, శశిభూషణ్‌రెడ్డి, యలమంద, ఆంజనేయులు,అలాగే మెప్మా కార్యాలయంలో జరిగిన సమీక్షాసమావేశంలో ఆయన పాల్గొన్నారు. పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన మంజుల శివపార్వతిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.

ఒకే గ్రామంలో 30 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

- వరుస చోరీలతో హడలిపోతున్న ముటుకూరు రైతులు



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు

దుర్గి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరుగ్రామంలో పొలాల్లో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలుధ్వంసం చేస్తున్నారు. ట్రాన్స్ ఫార్మర్లను పగులకొట్టి రాగి వైరుచోరీ చేస్తున్నారు. ఆరు నెలల్లో ఇదొక్క గ్రామంలోనే 30 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ కింద దాదాపు 50 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ల ధ్వంసంతో విద్యుత్‌సమస్య ఏర్పడి పంటలకు నీరందక ఎండిపోతున్నాయని, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల కోసం విద్యుత్ శాఖ అధికారులను ఆశ్రయిస్తే పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టాలని వేడుకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు



మాచర్లలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు ప్రశాంత్‌శర్మ



చెన్నాయపాలెం, వేమవరం, మాచవరంలో స్వామివార్లకు పూజలు..



సత్తెనపల్లి శివాలయంలో స్వామి వారిని సందర్శించుకుంటున్న భక్తులు

తొలి కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలలో శివ నామ స్మరణలు మారుమ్రోగాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆయా ప్రాంతాల్లోని ఆలయాల వద్దకు వెళ్లి, పుణ్యస్నానాలు ఆచరించి కార్తీకమాస దీపాలు వెలిగించి, స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని సందర్శించుకొని మొక్కులు చెల్లించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో కార్తీక మాస శోభ సంతరించుకుంది.

మాచర్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విజయపురిసౌత్‌లో గల శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు జూనూతల ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యాన స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రెంటచింతల(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్రశాల కృష్ణానది వద్ద వేలాది మంది భక్తులు వేకువజామునుంచే పుణ్య స్నానాలు చేసి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్లనుదర్శించుకున్నారు. రెంటచింతల, పాలువాయి శివాలయాల్లో హోమాలు చేశారు. సత్రశాలలో పలువురు దాతలు 1200 మందికి అన్నదానం చేశారు. అలాగే స్వామి వారికి వెండి ముక్కుపుడకలు కూడా అందచేసినట్లు దేవాదాయశాఖ ఈవో గాదే రామిరెడ్డి తెలిపారు.

మాచవరం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమవరం, మాచవరం, చెన్నాయపాలెం, పిన్నెల్లి, పిల్లుట్ల, మల్లవోలు, మోర్జంపాడు, బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస పూజలు ఘనంగా నిర్వహించారు. చెన్నాయపాలెం, వేమవరం గ్రామాల్లో తంగెగ గ్రామ పురోహితులు జానపాటి సీతారామ శర్మ, మాచవరం చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయంలో, బెల్లంకొండ సీతారామ శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి శివలింగాలను అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు ఆయా గ్రామాల శివాలయాల్లో పూజలు నిర్వహించారు.

సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయాల్లో శివ నామస్మరణలు మారు మ్రోగాయి. ఆలయాల్లో కార్తీక మాస పూజ సంతరించుకుంది. తెల్లవారు జాము నుంచే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి శివాలయాలకు వచ్చి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని సందర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్రోసూరు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు శివాలయాల్లో తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. క్రోసూరులోని పురాతన వీరభద్ర స్వామి దేవాలయం, మల్లిఖార్జున స్వామి దేవాలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపారాధనలు చేశారు. ధ్వజ స్తంభం, ఉసిరి చెట్టు, మారేడు చెట్టు, నవగ్రహాల వద్ద ప్రమిదలు ఏర్పాటుచేసి దీపారాధనలు నిర్వహించారు. స్వామి వారికి ఏకాదశ పూర్వక రుద్రాభిషేకం, మహన్యాసం, ఇతర అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు ఆలయ పూజారి కామేశ్వరరావు ఆధ్వర్యంలో వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని పీసపాడులో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



క్రోసూరు మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల దీపారాధనలు



సత్రశాల ఆలయంలో హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు

యూట్యూబ్.. సైన్స్ మాస్టారు



- లిటిల్ సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ పేరుతో ఛానల్
- 4.55 లక్షలకు చేరిన సబ్‌స్క్రైబర్లు
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విశేష ఆదరణ
- తెనాలికి గర్వకారణం రాయపాటి శివనాగేశ్వరరావు మాష్టారు

ఆయన ప్రభుత్వ పాఠశాల సైన్స్ మాష్టారు. 35 ఏళ్లకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ పిల్లలకు సైన్స్‌ని ప్రయోగాత్మకంగా బోధించేవారు. జనవిజ్ఞాన వేదిక వంటి స్వచ్ఛంధ సేవా సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేవారు. వారిలో ఉన్న అపోహలను తొలగించేవారు. ఏ సంస్థ పిలిచినా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా వెళ్లి లెక్చర్లు ఇచ్చేవారు. అలాంటిది కరోన లాక్‌డౌన్‌లో ఆయన ఇంటికి పరిమితం కావాల్సి వచ్చింది. ఆ సమయంలో పుట్టిన ఆలోచనే లిటిల్ సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ యూట్యూబ్ ఛానల్. అనతికాలంలో లక్షల సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకొని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల విశేష ఆదరాభిమానాలు పొందుతున్నారు. ఆయనే మన తెనాలి చెంచుపేటకు చెందిన రాయపాటి శివనాగేశ్వరరావు మాష్టారు.

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అనేక మండలాల్లో రాయపాటి శివనాగేశ్వరరావు మాస్టారు సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహించారు. సర్వీసు ఆఖరులో 9 నెలల పాటు హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహించి ఈ ఏడాది మార్చి 31వ తేదీన గురజాలలో ఉద్యోగ విరమణ చేశారు. కరోన సమయంలో తాను విద్యా బోధనకు దూరమౌతున్నానన్న బాధని ఎలాగైనా అధిగమించాలని తొలుత 2020 ఆగస్టులో తన నివాసంలో ఒక చిన్నపాటి సైన్స్ ల్యాబ్‌ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పాఠాలు చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఎలాగైతే ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాయో శివనాగేశ్వరరావు మాష్టారు కూడా అదే రీతిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించి వారిని లాక్‌డౌన్‌లో చదువుకు దూరం కాకుండా చేశారు.



సీఎం చంద్రబాబు నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకుంటున్న శివనాగేశ్వరరావు

అక్కరకు వచ్చిన ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ

తాను పని చేస్తున్న పాఠశాల విద్యార్థులకే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లోని పిల్లలకు సైన్స్ పాఠాలు ప్రయోగాత్మకంగా బోధించాలన్న ఆలోచన రావడంతో ఆయన లిటిల్ సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ యూట్యూబ్ ఛానల్‌ని ప్రారంభించాలని నిర్ణయిం చారు. ఇందుకోసం తొలుత ఆయన అప్పటికే యూట్యూబ్ రంగంలో లక్షల మంది సబ్‌స్క్రైబర్లు కలిగిన మెహబూబ్ బాషా, బోఘ వెంకట సుబ్బారావులను సంప్రదించి వారి వద్ద సలహాలు, సూచనలు తీసుకొన్నారు. ఉపాధ్యాయుడిగా కాకముందు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఎక్కువ మక్కువ కలిగివుండేవారు. ఆ అనుభవాన్ని వినియోగించుకొని సొంతంగా సైన్స్ ప్రయోగాలపై వీడియోలు చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం ప్రారంభించారు. తొలుత వేరే యూట్యూబర్లకు తాను చేసిన వీడియోలు పంపి ఏమైనా తప్పులు ఉంటే సరి చేయించే వారు. ఆ తర్వాత తనే ఎలాంటి లోపాలు లేకుండా వీడియోలు తీసి అప్‌లోడ్‌చేస్తున్నారు.

షార్ట్ వీడియోలతో అమాంతంగా పెరిగిన సబ్‌స్క్రైబర్లు

2022 డిసెంబరు నుంచి సైన్స్ ప్రయోగాలతో పాటు మరి కొన్ని షార్టు వీడియోలు తీసి అప్‌లోడ్ చేయడం ప్రారంభించారు. అప్పటివరకు 2,400 మంది ఉన్న వీక్షకులు ఒక్కసారిగా పెరగడం ప్రారంభించారు. అనూహ్యంగా స్పందన వచ్చింది. కేవలం మూడు నెలల వ్యవధిలోనే సబ్‌స్క్రైబర్ల సంఖ్య లక్ష దాటిపోయింది. అలా పెరుగుతూ నేడు 4 లక్షల 55 వేల మంది సబ్‌స్క్రైబర్లు శివనాగేశ్వరరావు మాష్టారు వీడియోలు వీక్షిస్తున్నారు. ఇప్పటికే 292 షార్టు వీడియోలను ఆయన అప్‌లోడ్ చేసి సైన్స్‌పై విద్యార్థులకు మక్కువ కలిగేలా చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోగాలపై వీడియోలు చేసి అప్‌లోడింగ్ చేయడానికి సరంజామ, అవసరమైన పరికరాలను ఆయన సమకూర్చుకొంటున్నారు.

విశేష ఆదరణ పొందిన వీడియోలలో కొన్ని

టీ కప్పులతో బెర్‌నౌలీ సూత్రాన్ని శివనాగేశ్వరరావు మాష్టారు కళ్లకు కట్టిన తీరు విశేషంగా యూట్యూబ్ వ్యూస్, లైక్‌లను తెచ్చి పెట్టింది. అలానే సింపుల్ ఎలక్ట్రిక్ మోటారు, యాంటీ గ్రావిటీ వాటర్ ట్రిక్, ఘోస్ట్ ఇన్ ఏ బాటిల్, పేపర్ గ్లైడర్ తయారీ, పీవీసీ పైపు నుంచి మ్యూజికల్ సౌండ్ ఉత్పత్తి, కప్‌లోని నీటితో సెంట్రీఫ్యూగల్ ఫోర్స్, ఎసిటలీన్ ఫ్యూయల్ రాకెట్, స్పిన్నింగ్ రింగ్స్ ఇల్యూషన్, కంప్రెషబుల్ ప్రాపర్టీ ఇన్ సాలిడ్స్ అండ్ లిక్విడ్స్, ఇంద్రధనస్సు రంగులను ఇంట్లో ఎలా తయారు చేయవచ్చు, టిబెటిన్ సింగింగ్ బౌల్ వంటి షార్టు వీడియోలు అమితంగా ఆకట్టుకొంటున్నాయి.





సైన్స్ అనేది బోర్డు మీద చెప్పే సబ్జెక్టు కాదు

సైన్స్ అనేది బోర్డు మీద చాక్‌పీసుతో రాసి చెప్పే సబ్జెక్టు కాదని అంటారు శివనాగేశ్వరరావు మాష్టారు. సైన్స్‌ని ప్రయోగాత్మకంగా చేసి చూపించాలి. ఏదైనా ప్రయోగం నిరూపించబడితేనే అది సైన్స్ అవుతుంది. లేదంటే సూడో సైన్స్ అవుతుంది. ఎలిమెంటరీ పాఠశాల నుంచి ప్రతీ దానిని పిల్లవాడికి అర్ధమయ్యేరీతిలో ప్రయోగాత్మకంగా చూపించాలి. అప్పుడే ఆ విద్యార్థిలో ఆలోచన శక్తి పెరుగుతుంది. ప్రయోగాత్మకంగా చెబితే విద్యార్థి ఒంటబట్టించుకొని మంచి శాస్త్రవేత్తగా ఎదగడానికి దోహదపడుతుంది. అప్పుడే కొత్త విషయాలు కనుగొనే శక్తి పెరుగుతుంది. విదేశాల్లో ఎలిమెంటరీ పాఠశాల దశలోనే ప్రయోగశాలలకు విద్యార్థులను పంపుతారు. మనకు అన్ని వనరులున్నా చేయడం లేదు. అందువలనే సైన్స్‌లో మనం వెనకబడిపోతున్నాం.



అమరావతి : క్యూలో స్వామి దర్శనం కోసం బారులు దీరిన భక్తులు



పెదకాకాని : కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



బాపట్ల : సూర్యలంకలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

పూజలు పుణ్యస్నానాలు

కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. ప్రసిద్ధ ఆలయాలైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధి, అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆలయం, పెదకాకాని మల్లేశ్వర స్వామి ఆలయం, బాపట్ల సూర్యలంక సముద్ర తీరానికి భక్తులు పోటెత్తారు. ఆయా ప్రాంతాల్లో స్వామివార్లకు కార్తీక ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాస పుణ్య స్నానాలను ఆచరించారు. ఆలయాల నిర్వాహకులు, పోలీసులు కార్యక్రమాలను, శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

అమరావతి, నరసరావుపేట, బాపట్ల, పెదకాకాని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆలయం పంచా రామ భక్తులతో కళకళలాడింది. పంచారామాలు ఒకే రోజున సందర్శిస్తే పుణ్యప్రదమని భావించే భక్తులు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుండి ప్రత్యేక బస్సులలో ఆదివారం రాత్రికి అమరావతి చేరుకుని తెల్లవారు జామున పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి నదీతీరంలో, ఆలయ ప్రాంగణములో కార్తీకదీపాలను వెలిగించారు. కొన్నిదీపాలను నదిలో వదలడంతో అమరేశ్వర స్నానఘాట్ దీపాల కాంతిలో వెలుగులు విరజిమ్మింది. అనంతరం స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లలో స్వామివారిని దర్శంచుకుని వెళ్లారు. మూడు గంటల పాటు క్యూలు భక్తులతో రద్దీగా మారాయి. కార్తీకమాస ప్రత్యేక అధికారి ఏఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి ఆధ్వర్యంలో డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో పోలీసులు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. దేవస్థాన సహాయ కమిషనర్, కార్య నిర్వాహణాధికారి పీ. సునీల్ కుమార్ ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ఆలయ సమీప ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారి, అర్చకులు స్వాగతం పలికి పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

- ఆలయాల్లో కార్తీక సోమవారం భక్తుల రద్దీ
- భక్తజనంతో కళకళలాడిన అమరేశ్వరాలయం
- త్రికోటేశ్వర స్వామికి వైభవంగా రుద్రాభిషేకం
- కాకాని మల్లేశ్వరుని సన్నిధికి పంచారామ భక్తులు
- సూర్యలంక తీరంలో భక్తుల ప్రత్యేక పూజలు
- స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

- కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప శ్రీ త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ సేవ జరిగింది. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసి నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక సర్వీసులు కొండకు నడిపింది. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది.
- బాపట్ల పట్టణంలోని శ్రీగంగాపార్వతి సమేత శ్రీసోమేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు కార్తీకదీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండే భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు విచ్చేసి పూజలు జరిపారు. అనేక ఆలయాలలో కార్తీకశోభ ఉట్టిపడింది. సూర్యలంక సముద్రతీరం వద్ద అనేక మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఇసుకతో శివలింగాలు ఏర్పాటు చేసి కార్తీకదీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. పోలీసు అధికారులు తీరం వెంబడి బందోబస్తుతో పాటు గజఈతగాళ్ళతో గస్తీ నిర్వహించే ఏర్పాట్లు చేశారు.
- పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపారాధనలు చేశారు. స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు జరిపించి, స్వామి వారి అన్నప్రసాదములు భక్తులు స్వీకరించారు. నిర్వాహకులు క్యూలలోని భక్తులకు పాలు, మజ్జిగ, మంచి నీళ్ళను ఉచితంగా అందజేశారు. దేవస్థాన ఉప కమిషనరు, కార్య నిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు ఏర్పాట్లను, బందోబస్తును పర్యవేక్షించారు. గుంటూరు జిల్లా కోర్టు 2వ అదనపు జిల్లా కోర్టు జడ్జిలు నాగ రాజు, శ్రీలత, 6వ ఎంఎం కోర్టు జడ్జీ, ఎంఎ ల్‌సీ కల్ప లతా రెడ్డి స్వా మిని ద ర్శించు కు న్నారు.



కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామికి క్షీరం, పసుపు, గంధం, కుంకుమతో అభిషేకాలు

- 'నూతిలో గొంతుకలు' కవితా సంపుటితో ప్రసిద్ధి
- ఆజన్మ బ్రహ్మచారిగా కవితలకే జీవితం అంకితం
- 'ఆలూరి'కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో జిల్లాకు ఘనత
- ప్రత్తిపాడు హైస్కూల్లో ఉపాధ్యాయుడుగా సేవలు
- నేడు ఆలూరి బైరాగి జయంతి

మానవతా వాది ఆలూరి బైరాగి



గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, కథా రచయిత ఆలూరి బైరాగి జిల్లాకే గర్వకారణం. ఆయన గొప్ప మానవతా వాదిగా వినతికెక్కారు. 'నూతిలో గొంతుకలు' అనే కవితా సంపుటితో ఆయన ప్రసిద్ధి చెందారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో ఆయన పేరు దేశవ్యాప్తమైంది. గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఐతానగర్‌కు చెందిన ఆలూరి బైరాగి జయంతి సందర్భంగా పలువురు కవులు, కథా రచయితలు స్మరించుకుంటున్నారు. ఐతానగర్‌కు చెందిన ఆలూరి వెంకటరాయుడు, సరస్వతి దంపతుల కుమారుడు ఆలూరి బైరాగి 1925, నవంబరు 5న జన్మించారు. బైరాగి ఆజన్మచారిగా ఉన్నారు. మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన బైరాగి రెండో తరగతి వరకు తెలుగు మీడియంలోనే చదువుకున్నారు. ఆయన తండ్రి వెంకటరాయుడు దేశ భక్తుడు. తండ్రి హిందీ చదవమని ప్రోత్సహించటంతో 1935 ప్రాంతాల్లో యలమంచిలి వెంకటప్పయ్య స్థాపించిన హిందీ పాఠశాలలో చేరారు. 13వ ఏట హిందీలో ఉన్నత విద్య అభ్యసించటానికి ఆయన ఉత్తరాది వెళ్లారు. 15వ ఏటలోనే ఆయన హిందీలో కవితలు రాసి కవి సమ్మేళనాల్లో పాల్గొనటం విశేషం. బైరాగి కవితా వ్యాసంగపు తొలినాళ్ళలోనే పలాయన్ అనే పేరుతో హిందీ కవితా సంకలనం ప్రచురించారు. తండ్రి అడుగు జాడల్లో 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. ఆ తరువాత ఎమ్ఎన్ రాయ్ నెలకొల్పిన రాడికల్ డెమోక్రాటిక్ పార్టీకే అంకితమయ్యారు. స్వతహాగా ఆంగ్లం నేర్చుకొని ఆంగ్లంలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. 1946లో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయుడుగా చేరారు. బైరాగి బహుబాషా కోవిదుడు కూడా. ఆయనకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు బాషలతో పాటు బెంగాలి, ఉర్దూ భాషలలో కూడా ప్రవేశం పొందారు.

హిందీ చందమామకు సంపాదకత్వం

బైరాగి పినతండ్రి చందమామ వ్యవస్థాపకులలో ఒకరైన చక్రపాణి (ఆలూరి వెంకటసుబ్బారావు) హిందీ చందమామకు సంపాదకత్వం వహించమని కోరటంతో మకాం మద్రాసుకు మార్చారు. హిందీ చందమామలో పిల్లల కోసం చిట్టి పొట్టి కవితలు, కథలు రాశారు. తొలి నుంచి స్వేచ్ఛాజీవి అయిన బైరాగి చందమామలో కొనసా గలేక బయటకు వెళ్ళిపోయారు. తెలుగులో బైరాగి మొదటి కవితా సంకలనం చీకటి నీడలు ప్రచురించారు. నూతిలో గొంతుకలు, దివ్యభవనం కథా సంపుటిని ప్రచురించారు. బైరాగి రచనలలో కెల్లా నూతిలో గొంతుకలు ఆయన ఉత్కృష్ట రచన. బైరాగి స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తి. ఆయన తన పంథా మార్చుకోవాలని ఎవరైనా సలహాలు ఇచ్చినా నవ్వి ఊరుకునే వారే తప్ప తన భావాలను మార్చుకునే వారు కాదు.

నిరాడంబర జీవితం.....హైదరాబాద్‌లో మరణం

బైరాగి చాలా నిరాడంబరంగా జీవితం గడిపారు. 1978లో క్షయవ్యాధికి గురైన సందర్భంలో మిత్రులు ఎంత చెప్పినా వైద్యం పట్ల ఆసక్తి చూపకపోవడమే ఆయనకు చేటు చేసింది. చివరి రోజుల్లో ఆయన తన మకాం హైదరా బాద్‌కు మార్చారు. ఆంగ్లంలో ఒక మంచి నవల రాశారు. ఆయన నవల, నాటకం, కొన్ని అముద్రితాలుగానే మిగిలిపోయాయి. బెంగాలీ భాష కూడా నేర్చుకున్నారాయన. బెంగాలీలో జీవనానంద దాస్ అనే కవి ఆయనకి చాలా ఇష్టంఅని చెప్పేవారు. ఆజన్మ బ్రహ్మచారి అయిన బైరాగి 54 ఏళ్ళ వయస్సులో 1978 సెప్టెంబరు 9న కన్నుమూశారు. ఆయన మృతితో తెలుగు సాహిత్యంలో ఒక ధృవతార నేల రాలిపోయినట్లయింది. బైరాగి మరణానంతరం 1984లో ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును ప్రదానం చేసింది.

నవ్య పద ప్రయోగకర్తగా ప్రత్యేక స్థానం

తెలుగులో నవ్య పదప్రయోగ కర్తగా బైరాగికి ప్రత్యేక స్థానం ఉంది. ఆయనలో ప్రధానంగా అస్తిత్వ వాదం, సామ్యవాదం కనిపిస్తాయి. ఎమ్ఎన్‌రాయ్ ఆలోచనలు, సిద్ధాంతాల ప్రభావం ఎక్కువగా ఉండేది. ఫలితంగా అస్థిత్వవాదం నుంచి సామ్యవాదానికి మొగ్గుచూపాడు. ఆయన సాహిత్యంలో ఈ రెండు వాదాలు బలంగా కనపడతాయి. బైరాగి తొలి కవితా సంపుటి 'చీకటి నీడలు' ధ్వంస వాదంతో పాటు పేదల పక్షం వహించడం ఇందులో ప్రధాన కనపడుతుంది.

తొలి కవితా సంపుటి చీకటి నీడలుతో ప్రారంభం

బైరాగి తొలి కవితా సంపుటి 'చీకటి నీడలు'తో ప్రారంభమై అనేక కవితలు ఆయన కలం నుంచి జాలువారాయి. 'ఆగమగీతి'కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. నూతిలో గొంతుకలు, దివ్య భవనం (కథలు), కాంచన మృగం (రూపకం), పాప పోయింది (నవల) హిందీలో 'నయా కవిత'కూడా రాశారు. హిందీ నుంచి అనేక అనువాదాలు కూడా చేశారు. ఆలూరి బైరాగి అస్తిత్వ వేదన పేరుతో ఆంగ్లంలో రాసిన కవితా సంపుటి ఇందులో 80కు పైగా కవితలున్నాయి.

అంతర కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఈపూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాలలో ఈ నెల 6వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధి లోని కళాశాలలకు చెందిన స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ చైర్మన్ చుండు వెంకట్రావు తెలిపారు. పోటీలలో ఎంపికైన వారు నవంబరు 26నుంచి డిసెంబరు 3 వరకు జరుగు సౌత్, వెస్ట్ అంతర విశ్వవిద్యాలయాల పోటీలలో పాల్గొంటారన్నారు.

జోన్ డైరీ

● నాదెండ్ల: మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని శివనాగేంద్రస్వామి దేవాలయ 39వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామి వారి జెండా ఊరేగింపు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం: జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

నరసరావుపేట కల్చరల్, నవంబరు 4: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పించడమే జాబ్‌మేళాల లక్ష్యమని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజీరావు అన్నారు. సోమవారం స్థానిక లింగంగుంట్లలోని నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ జాబ్‌డ్రైవ్‌లో 3 కంపెనీలు పాల్గొనగా 66మంది నిరుద్యోగ యువత హాజరయ్యారని, వీరిలో 46 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు.

సిద్ది నాగ మల్లేశ్వరస్వామి దేవాలయానికి విద్యుత్ పునరుద్ధరణ

వినుకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని శివాపురం గ్రామ సమీపంలోని కాకతీయ కాలంనాటి సిద్ది నాగ మల్లేశ్వరస్వామి దేవాలయానికి గత నాలుగు సంవత్సరాలుగా కరెంట్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ కనెక్షన్ తొలగించారు. శివాలయానికి విద్యుత్ కనెక్షన్ తొలగింపుపై ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్త నాగేశ్వరరావుతో పాటు గ్రామస్థులు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకురావడంతో ఎట్టకేలకు విద్యుత్‌శాఖ అధికారులు కార్తీక సోమవారం సందర్భంగా విద్యుత్‌ను పునరుద్ధరించారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

వినుకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) శైవక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినుకొండ డిపో నుంచి పంచారామ క్షేత్రాలకు రూ.1400, యాగంటి మహానంది, అహోబిలం, ఒంటిమిట్ట, బ్రహ్మంగారి మఠం, సిద్దయ్య మఠాలకు రూ.1600, అరుణాచలంకు రూ.2550లకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా శబరిమలకు ప్రత్యేక రాయితీతో బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు పూర్తి వివరాలకు 9959225431. 9390835412. 7382898320 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్తం...

● నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పట్టాభిరామ స్వామి ఆలయం ప్రాంగణంలోని వెంకటేశ్వర కళ్యాణమండపంలోయంగ్ స్టార్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహావీర గణపతి ఏకాదశి 11వ వార్షిక విందు కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

● నూజెండ్ల: రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ సర్పంచ్ అయిన తన భార్యను దూషించారంటూ కంచర్ల వెంకటేశ్వర్లు తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

● ఈపూరు: రైతులు ఫిర్యాదు మేరకు మండలంలోని ఊడిజర్లలో వరిపైర్లను వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బీ రవి బాబు, మండల వ్యవసాయాధికారి రామారావు సోమవారం పరిశీలించారు.

● శావల్యాపురం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదల నిరంతరం కృషి చేస్తున్న క్లాప్‌మిత్రలకు పంచాయతీ ఖాతాల నుంచి వెంటనే వేతనాలను చెల్లించాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

● శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 25మంది లబ్ధిదారులకు ప్రభుత్వం గోకులం షెడ్లను మంజూరు చేసిందని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. శావల్యాపురంలో గోకులం షెడ్డు నిర్మాణానికి ఎంపీడీవో సోమవారం శంకుస్థాపన చేశారు.

● నరసరావుపేట టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 కబడ్డీ స్టేట్‌మీట్‌కి వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు బోయిన గోపి, వలమల శివరామ్, కొండ ప్రతాప్, బడిశె మారుతి కుమార్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. కావలిలో 6,7,8 తేదీలలో జరిగే స్టేట్ మీట్‌లో గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

● నరసరావుపేట లీగల్: నరసరావుపేట మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉదయశ్రీని నియమిస్తూ మునిసిపల్ కమిషనర్ జశ్వంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో ఆమె మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని అన్నవరం సొసైటీ సీఈవోగా దొప్పలపూడి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు.

● నరసరావుపేట టౌన్: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలవడానికి కర్నూలు జిల్లా ఆదోని మండలంకు చెందిన వీర మహిళ రాజేశ్వరియాదవ్ చేపట్టిన వారాహీ సైకిల్ యాత్ర నరసరావుపేటకు చేరుకుంది. సోమవారం నరరావుపేట జనసేన కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ ఆమెకు స్వాగతం పలికారు.

● చిలకలూరిపేట: దూర విద్యా విధానంలో డిగ్రీ పొందిన అభ్యర్థులు పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు నమోదు చేసుకోవడానికి అర్హులేనని ఏపీ ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఫోరం వ్యవస్థాపకులు షేక్ జాఫర్ తెలిపారు.

సభలు ముగిశాయి.. సమస్యలు మిగిలాయి

యడ్లపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రీసర్వే అనంతరం ఏర్పడిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభలు శనివారం ముగిశాయి. మండలంలోని 12 రెవెన్యూ గ్రామాల పరిధిలో గ్రామసభలు నిర్వహించగా ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలను అందజేశారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అంటూ గత ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టింది. అయితే వాస్తవంలో సమస్యలు పరిష్కారం మాట అటుంచి కొత్త సమస్యలు వెలుగు చూస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీసర్వేతో నష్టపోయామని రీసర్వే తప్పుల తడకగా ఏకపక్షంగా సాగుతోందని చెప్పినా ఎవరూ ఆలకించలేదని, తమకు న్యాయం చేయాలంటూ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అంతేగాకుండా ప్రతి సోమవారం ప్రభుత్వం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులే అధికంగా ఉంటున్నాయి. దీనితో కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రీసర్వే పూర్తయిన గ్రామాలలో గ్రామసభలను నిర్వహించాలని నిర్ణయించి, అక్టోబరు 1 నుంచి నవంబరు 2వరకు 12రోజుల పాటు గ్రామసభలు నిర్వహించింది. ఆయా గ్రామ సభలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై రీసర్వే అనంతరం ఏర్పడిన భూ సమస్యలను పరిష్కరించాలంటూ 1,082 అర్జీలను అధికారులకు అందించడంతో సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది.



కారుచేలలో జరిగిన గ్రామసభలో అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

రీసర్వే అనంతరం ఏర్పడిన ప్రధాన సమస్యలు..

1 భూ విస్తీర్ణాలలో వ్యత్యాసం, 2. పొలాల సరిహద్దుల్లో తేడా. 3. భూ హక్కు పత్రాల్లో తప్పులు, 4. ఉమ్మడిగా ఎల్‌పి(ల్యాండ్ పార్శిల్) నంబర్లు ఇవ్వడం, 5. రైతుల పేర్లు తారుమారు, 6. ఎల్‌పీఎం నంబర్లకు తగినట్లుగా సర్వే నంబర్లు కొన్నిచోట్ల అనుసంధానం కాకపోవడం 7. ప్రస్తుత యజమాని పేరు కాకుండా పాతవారి పేర్లు రావడం, 8. చనిపోయిన వారి పేర్లు, విక్రయదారుని పేర్లు నమోదు చేయడం వంటివి ఉన్నాయి.

రైతుల సమక్షంలో కాకుండా ఏకపక్షంగా అస్తవ్యస్తంగా సర్వే నిర్వహించడంతో అనేక మంది రైతులు 10 నుంచి 30 సెంట్ల వరకు భూమిని కోల్పోయారు. ఈవిషయమై రైతులు రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే గట్ల మధ్య కొలిచామని, అంతే ఉందంటూ దబాయిస్తున్నారు. పక్క రైతుకు ఉండవలసిన దానికన్నా ఎక్కువ ఉందని, తమకేమో తగ్గించారని ఆధారాలతో సమర్పిస్తే ఆ రైతుతో ఒప్పిస్తే సరిచేస్తామంటూ చెబుతున్నారు. సదరు రైతు సవరణకు ముందుకు వస్తే సమస్య పరిష్కారం అవుతుండగా అడ్డం తిరిగితే గొడవలకు దారితీస్తోంది. అలాగే సరిహద్దుల్లో తేడాలు నమోదు చేయడంతో పక్క రైతులతో వివాదాలు పెరిగాయి. అన్నదమ్ములు సైతం ఈ విషయంలో గొడవలు పడుతున్నారు. భూ విస్తీర్ణాలు తగ్గాయంటూ గ్రామసభల్లో 545 అర్జీలు వచ్చాయంటే ఏ స్థాయిలో తప్పులు దొర్లాయో అర్థం చేసుకోవచ్చు. భూహక్కు పత్రాలలో భూ యజమాని పేరు, తండ్రి పేర్లు తప్పుగా నమోదు చేయడం, ఒకరి ఫొటోకు బదులు మరొకరి ఫొటో ముద్రించడం, ఆధార్ నంబర్లలో తేడాలు, ఒకరి ఆధార్‌కి బదులుగా మరొకరి ఆధార్ నంబరు నమోదు చేయడంతో వాటిని సరిచేయించుకునేందుకు రైతులు నానా తిప్పలు పడుతున్నారు. పైగా సవరణకు ఇంకా అనుమతులు రాలేదంటూ అధికారులు చెబుతుండడంతో ఏమి చేయాలో రైతులకు పాలుపోవడం లేదు. విడివిడిగా పొలాలు ఉన్న వారికి ఇరువైపులా ఉన్న వారితో కలిపి ఒకే ఎల్‌పీఎం నంబరుతో పాసుపుస్తకాలు ఇవ్వడంపై రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఎల్‌పీఎం నంబర్లతో రైతుల మధ్య గొడవలు తలెత్తుతున్నాయని, బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని, జాయింట్ నంబరు నుంచి తొలగించి విడిగా పాసుపుస్తకాలు ఇవ్వాలని 83మంది రైతులు గ్రామసభలో అధికారులకు అర్జీలు అందించారు. రీసర్వే అనంతరం ఏర్పడిన ప్రధాన తప్పుల్లో ప్రస్తుత యజమానికి బదులుగా పాత లేదా విక్రయించిన వారి పేర్లు నమోదు కావడం జరిగింది. దీనితో ప్రస్తుత యజమాని మ్యుటేషన్ చేయించుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కొంతమంది ఏళ్ళ కిందట భూములను కొనుగోలు చేసి రెవెన్యూ రికార్డులలో తమ పేరుతో నమోదు చేయించుకోలేదు. దీనితో విక్రయదారుని పేరుతో పాసుపుస్తకాలు రావడం, ఆన్‌లైన్‌లో వారి పేర్లు నమోదు కావడం జరిగింది. పాసుపుస్తకాలు పొందిన విక్రయదారులు కొంతమంది తిరిగి ఒకసారి విక్రయించిన భూమినే మరొకరికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనితో వివాదాలు తలెత్తుతున్నాయి. అధికారులు తాము చేసిన తప్పులను తామే సరిచేసి సమస్యలు లేకుండా చూడాలని కోరుతున్నారు. అధికారులు నిర్వహించిన గ్రామసభలకు ప్రజలు స్పందించి అర్జీలను అందజేశారు. అర్జీలను స్వీకరించి నెల రోజుల వ్యవధిలో అర్జీలను పరిష్కరిస్తామంటూ అధికారులు హామీలు ఇచ్చారు. అయితే ఏ మేరకు వారి హామీలు నెరవేరతాయో వేచి చూడాలి.

స్టోర్ రూమ్‌లో కోడెల విగ్రహం... అభిమానుల్లో ఆవేదన

నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రభుత్వ వైద్యశాల వద్ద మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు విగ్రహంపై వివాదం కొనసాగుతోంది. ఇటీవల డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఐదో వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయడానికి అభిమానులు ప్రయత్నించారు. అప్పట్లో విగ్రహం ఏర్పాటు గురించి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు, ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. విగ్రహం ఏర్పాటు సమయంలో ఇంకా కొన్ని ఇబ్బందులు ఉన్నాయని చెప్పడంతో ఏర్పాట్లు నిలిపివేశారు. అయితే విగ్రహం అవమానకరంగా తొలగించారని ప్రచారం జరగడంతో డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం ఎక్కడ ఉందో చూపాలని సోమవారం అభిమానులు ఆసుపత్రి సూపరిటెండెంట్‌ను డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు పేరు చెప్పి అధికారులు తప్పించుకోవడం సరికాదని సూపరింటెండెంట్ ఏడుకొండలుతో వాగ్వివాదానికి దిగారు. అదేవిధంగా సీసీ కెమెరాలు ఆపి విగ్రహం తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. విగ్రహాన్ని భద్రపరిచామని అధికారులు చెప్పడంతో ఎక్కడ భద్రపరిచారో చూపాలన్నారు. దీంతో అధికారులు ఆసుపత్రి రెండో అంతస్తులో బాత్‌రూంల సమీపంలో ఉన్న స్టోర్‌రూమ్‌లో ఉన్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని చూపించారు. అక్కడ ఉన్న విగ్రహాన్ని చూసి కోడెల అభిమానులు తీవ్ర ఆవేదన చెందారు. ఇదేనా మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావుకు ఇచ్చే గౌరవమంటూ ప్రశ్నించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం ఏర్పాటు చేయాలని ఆదేశించారని సూపరిటెండెంట్‌కు ఆయన వీడియో మెసేజ్‌ను చూపించారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని స్టోర్ రూమ్‌లు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విగ్రహం భద్రపరచడం అంటే ఇదేనా అధికారులపై మండిపడ్డారు. తక్షణమే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



స్టోర్ రూమ్‌లోని కోడెల విగ్రహాన్ని పరిశీలిస్తున్న అభిమానులు, కార్యకర్తలు

అందరి సమక్షంలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం

● మంత్రి గొట్టిపాటి రవి కుమార్



నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి కోడెల శివప్రసాదరావుకు ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం కోడెల విగ్రహం ఏర్పాటుపై జరుగుతున్న వివాదంపై ఆయన అమరావతిలో స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ టీడీపీకి కోడెల చేసిన సేవలు వెల కట్టలేనివని, ఆయన గౌరవ మర్యాదలకు ఎక్కడా భంగం వాట్లిదని అభిమానులకు హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లాలో కోడెల అంటే తెలియని వారు ఎవరూ లేరని, అలాంటి మహా నాయకుడి విగ్రహాన్ని దొంగచాటుగా అర్ధరాత్రులు పెట్టాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. త్వరలోనే డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని అన్ని అనుమతులతో జిల్లా నాయకులందరి సమక్షంలో గౌరవప్రదంగా ప్రతిష్టిస్తామని పేర్కొన్నారు. అయితే కొన్ని శక్తులు ఉద్దేశపూర్వకంగా సమస్యలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. స్వార్థ రాజకీయాల కోసం పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా సహించేది లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.



ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

రోడ్లను అద్దంలా తీర్చిదిద్దాలి: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల మరమ్మతులు వేగంగా పూర్తిచేసి అద్దంలా తీర్చిదిద్దాలని అర్అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. సోమవారం చిలకలూరిపేటలోని తన నివాసంలో ఆర్అండ్‌బీ అధికారులతో ప్రత్తిపాటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించామని, ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల జోన్‌లను గుర్తించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం రూ.860 కోట్లతో రోడ్ల మరమ్మతుల కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ డీఈ, జేసీ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట అర్బన్: చిలకలూరిపేట నియోజక వర్గంలో వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న 13మందికి సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే తన నివాసంలో అందజేశారు. 13 మందికి గాను రూ 8,17,306 వచ్చినట్టు ఆయన తెలియ జేశారు.

● నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడులో అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శంకుస్థాపన చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షల అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటేశ్వరమ్మ, ఎంపీడీవో స్వరూపరాణి, జనసేన ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు బీ సత్యనారాయణ, ఆర్ నాగేశ్వరరావు, గుర్రం నాగపూర్ణచంద్రరావు, రామాంజనేయులు, జవ్వాజి మదన్, జయప్రసాదు, ఆలూరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లు సోకిన పంట పొలాలను సందర్శించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మిర్చి పంటకు సోకిన ఆకుముడత పరిశీలిస్తున్న సైంటిస్ట్ సాంబశివరావు, డీడీఏ శివకుమారి

వినుకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) తెగుళ్లు సోకిన పంట పొలాలపై ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన తెగుళ్లతో రైతులకు కంటి మీద కునుకు లేదు అనే కథనంపై సోమవారం జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించారు. జాలపాలెం సమీపంలో గోనుగుంట్ల కోటేశ్వరరావు అనే రైతు సాగుచేస్తున్న వరి పంటతో పాటు వర్షం నీటి తాకిడికి దెబ్బతిన్న మిర్చి పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. రైతులు పంటలకు వ్యాపించిన పురుగు, తెగుళ్ల నివారణకు అధికారుల సూచనల మేరకు మందులను పిచికారి చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సాంబశివరావు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే ఆచార్య రంగా యూనివర్సిటీ టోల్‌ఫ్రీ నంబర్ 18004250430 ఫోన్‌చేసి రైతులు సలహాలు సూచనలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీడీఏ. డీఆర్‌సీ శివకుమారి, కలుపు నివారణ సీనియర్ సైంటిస్ట్ అమరజ్యోతి, ఏవో అంజిరెడ్డి, వీఏఏ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలి: కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం నరసరావుపేట పల్నాడు జిల్లా కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 70మంది అర్జీదారులు వినతులను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. కార్రక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు 72 ఫిర్యాదులను అందజేశారు.

భూములపై హక్కులు కల్పించాలని ఎస్సీ కాలనీవాసుల వినతి

యడ్లపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని మండలంలోని కారుచేల గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కారుచేల రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నం.358-3, 360-1బీలు దాఖలా య.9.99సెంట్లు వ్యవసాయ భూమి ఉందన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన 50 కుటుంబాలు 0.20సెంట్లు చొప్పున వారసత్వంగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నా ఇంత వరకు పాసుపుస్తకాలు మంజూరు చేయలేదని, రీసర్వే పూర్తయినప్పటికి తమపేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదన్నారు. భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి పాసుపుస్తకాలు ఇప్పించాల్సించాలని ఎం.రజిని, ఎం.రూబేను, కె జార్జి, ఎ నాగభూషణం తదితరులు కోరారు.

త్రికోటేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరుని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కడియాల రమేష్, కడియం కోటిసుబ్బారావు, తాండవ కృష్ణ, రంగిశెట్టి రామకృష్ణ, మాజేటి వెంకటేష్, తాళ్ళూరి సత్యనారాయణ, కాసా అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు అవసరం: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ బాలబాలికల టోర్నమెంట్ పట్టణంలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని విజేతకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాయల శ్రీనివాసరావు, షైనీడి శ్రీనివాసరావు, ఎన్ సురేష్ కుమార్, వనమా శివ, గడిపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో చిలకలూరిపేట విద్యార్థికి బంగారు పతకం

చిలకలూరిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన జేకే నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2024 పోటీలలో అండర్ 14కటా విభాగంలో స్థానిక మోడరన్ స్టెల్లార్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి ధనుకోటి జశ్వంత్ ప్రథమ స్థానం పొంది బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ చేబ్రోలు మహేష్, ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణి కుమార్, కరాటే ఉపాధ్యాయులు బి.రాజ, ఉపాధ్యాయులు జస్వంత్‌ను అభినందించారు.



బంగారు పతకం సాధించిన జస్వంత్



కార్తీక సోమవారం సందర్భంగా వినుకొండలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

శివాలయాల్లో వైభవంగా కార్తీక అభిషేకాలు

నరసరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయాల్లో కార్తీకమాస వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. కార్తీక సోమవారం పురస్కరించుకొని శివునికి రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఆలయాల ప్రాంగణాల్లో పెద్దఎత్తున దీపారాధనలు చేశారు. గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష అలంకారం చేశారు. బరంపేటలోని వాయుమల్లేశ్వర స్వామి ఆలయం, శృంగేరి శంకర మఠంలో చంద్రమౌళేశ్వర స్వామికి, లింగంగుంట్ల శివాలయం, బాలయ్య నగర్ శివాలయంలో అభిషేకాలు, పల్నాడు రోడ్డులోని సత్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని శివుని విగ్రహం వద్ద భక్తులు దీపారాధనలు చేశారు.

● వినుకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవాలయాల్లో కార్తీక దీపారాధన వెలిగించి, అనంతరం స్వామి వారికి పూజలు నిర్వహించారు. పట్టణంలోని పాత శివాలయం, కపటేశ్వర ఆలయం, ఆర్టీసీ బస్టాండ్ వద్దగల మంజునాథ దేవాలయం, శివాపురం వద్ద శిద్ద నాగమల్లేశ్వస్వామి దేవాలయం, నీలగంగారం సమీపంలోని పంచలింగేశ్వరస్వామి, పట్టణంలోని వెంకటేశ్వరస్వామి, లలితాంబికా దేవాలయాల్లో కార్తీక దీపారాధనకు వచ్చిన భక్తులతో కిటకిటలాడాయి.

● నూజెండ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాలయాల్లో, గుండ్లకమ్మ నది, ఎన్ఎస్‌పీ కాలువల వద్ద కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు కార్తీక దీపారాధనలు చేశారు. సాయంత్రం దేవాలయాల వద్ద జరిగిన కార్తీక మాస పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

● రొంపిచర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్లలోని శంకరస్వామి, వడ్డమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వర స్వామి, గోగులపాడులోని చంద్రమౌళీశ్వర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, గోగులపాడు, సంతగుడిపాడు గ్రామాల్లోని వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా మాస్టర్ ప్లాన్

● విచారణ కోరుతూ మంత్రి నారాయణకు వినతి

చిలకలూరిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులకు మేలు చేసేలా ఎన్నికలకు ముందు హడావుడిగా చిలకలూరిపేట మునిసిపాలిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను తయారుచేసి, ఆమోదించారని పురపాలక శాఖ మంత్రి పీ నారాయణకు సోమవారం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ, గుంటూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావులు వినతి పత్రం అందచేశారు. ఈ మాస్టర్ ప్లాన్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నదని వారు పేర్కొన్నారు. దీనివెనక మాజీ మంత్రి విడదల రజిని, అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఉన్నారని తెలిపారు. మార్చి 13, 2024న జీవోఎంఎస్ 46ద్వారా ఒక పద్ధతి లేకుండా దీనిని ఆమోదించారని మంత్రి నారాయణకు వివరించారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి పర్యవేక్షణ చేయకుండా, చిలకలూరిపేట ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఈ మాస్టర్ ప్లాన్ ద్వారా గత వైసీపీ పాలకులు ఇష్టానుసారంగా, తమ పార్టీ నాయకులకు లబ్ధి చేకూరేలా పట్టణాభివృద్ధి ప్రణాళికను రూపొందించారని పేర్కొన్నారు. ఈ ప్లాన్‌ను యథాతథంగా అమలుచేయడం వలన పట్టణాభివృద్ధికి తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్పారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని చిలకలూరిపేట మాస్టర్‌ప్లాన్‌ను పునఃసమీక్షించాలని వారు మంత్రిని కోరారు. చిలకలూరిపేట మునిసిపాలిటీ అభివృద్ధి, ప్రజల విస్తృత ప్రయోజనాల కోసం మాస్టరు ప్లాన్‌లోని తప్పులను సరి చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్టు

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కంభం పట్టణంలో నివాసం ఉంటున్న పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన నిందితుడు షేక్ రఫిని కారు చోరీ కేసులో పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఆయన వద్ద చోరీకి పాల్పడిన కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వీరేంద్రబాబు నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు రఫీ స్వగ్రామం పల్నాడు జిల్లా వినుకొండ టౌన్ లోని చట్టుబజారు. నిందితునికి వివాహమై, ఇద్దరు పిల్లలు. రఫీ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తుంటాడు. 15 సంవత్సరాల నుంచి దొంగతనాలు చేస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. నిందితుడు సుమారు 30కి పైగా నేరాలు చేసి వివిధ కేసులలో జైలుకు వెళ్ళి వచ్చాడు.

యడ్లపాడులో ఆక్రమణల తొలగింపు

యడ్లపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు పనులకు పంచాయతీ అధికారులు సోమవారం ప్రారంభించారు. రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండడంతోపాటు వర్షపునీరు పోయే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా కాలువల్లో ఏళ్ళతరబడి పేరుకుపోయిన సిల్టును తొలగించేందుకు వీలులేకుండా పోయింది. దీంతో వర్షం కురిసినప్పుడల్లా వాననీటితో కలసి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు ఆక్రమణలు తొలగించాలని ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పంచాయతీ అధికారులు ఇళ్ళ యజమానులకు నోటీసులు ఇచ్చి స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. అయితే ప్రజలు స్పందించకపోవడంతో ఆక్రమణల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పంచాయతీ కార్యదర్శి శశికళ తెలిపారు. తిరిగి ఆక్రమించుకోకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



క్రాస్ కంట్రీలో ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, సిబ్బంది

క్రాస్ కంట్రీలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రాస్ కంట్రీ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి మహిళా విభాగంలో ద్వితీయస్థానం సాధించారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించిన క్రాస్ కంట్రీ పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. ఏఎన్‌యూ క్రాస్ కంట్రీ జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన కే విశాలాక్షి, టీ కస్తూరి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 18, 19వ తేదీలలో మంగుళూరులో జరిగే అఖిల భారత అంతర విశ్వవిద్యాలయం క్రాస్ కంట్రీ పోటీలలో విద్యార్థులు ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ ఈదర ఆదిబాబు తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కే నానరయ్య, ఎస్‌కే సర్దార్, ఎస్‌కే మహమ్మద్ తదితరులు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, కంపెనీల ప్రతినిధులు

ప్రాంగణ ఎంపికల్లో 27మంది తిరుమల విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట కల్చరల్, నవంబర్, 4: స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 27మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ మాట్లాడుతూ ఒకే కంపెనీకి తమ కళాశాలకు చెందిన 27మంది విద్యార్థులు ఎంపికవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులను, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.సాంబశివరావును కళాశాల సిబ్బంది అభినందించారు.